

ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు

- ప్రతి పంచాయతీలో ఓ మోడల్ ప్రాథమిక పాఠశాల
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

· 8లో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమికోన్నత పాఠశాలలను పూర్తిగా రద్దు చేయనున్నామని, వాటి స్థానంలో ప్రతి పంచాయతీకి ఒక మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

సొంతగూడుకు నోచుకోని వందలాది కేంద్రాలు

- వైసీపీ హయాంలో 770 భవనాలు మంజూరు
- బిల్లులు సక్రమంగా ఇవ్వకపోవడంతో పనులు మధ్యలో ఆపేసిన కాంట్రాక్టర్లు
- అసంపూర్తిగా 265 భవనాలు
- పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం
- ప్రతిపాదనలు పంపిన జిల్లా అధికారులు



పరవాడ మండలం రేఖవానిపాలెంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పలు అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు పడకేశాయి. దీంతో చాలీచాలని అద్దె భవనాల్లో, అరకొర వసతుల మధ్య కేంద్రాలు కొనసాగుతున్నాయి. సరైన సదుపాయాలు లేకపోవడంతో నిర్వాహకులతోపాటు చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడం, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వివిధ దశల్లో పనులు ఆగిపోయాయి.

జిల్లాలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులు 39,230 మంది, మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులు 15,377 మంది, గర్భిణులు 8,638 మంది, బాలింతలు 6,751 మంది సేవలు పొందుతున్నారు. అయితే సగానికిపైగా కేంద్రాలకు సొంత గూడు లేకపోయింది. 836 కేంద్రాలకు మాత్రమే సొంతంగా పక్కా భవనాలు ఉన్నాయి. 433 అంగన్‌వాడీ కేంద్రాలను పరాయి పంచన.. అంటే పంచాయతీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాల్లో నడుపుతున్నారు. మిగిలిన 639 అంగన్‌వాడీ కేంద్రాలు అరకొర వసతి వున్న అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, పిల్లలకు ఆటపాటతో విద్య అందించడం, నిద్రపుచ్చడం వంటివి చేయాలి. అయితే అద్దె భవనాలు ఇరుకుగా వుండడం, కొన్ని భవనాలు



పాయకరావుపేట పల్లివీధిలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

శిథిలస్థితిలో వుండడంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. భవనాలు కూలే స్థితిలో వుండడంతో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడానికి ఇష్టపడడంలేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లించలేదు. ఐదేళ్ల కాలంలో 770 అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు చేసింది. కానీ నిధులు విడుదల చేయలేదు. దీంతో నిర్మాణ పనులు పూర్తి కాలేదు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎన్నికల ముందు వరకు 421 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. వీటికి కూడా కాంట్రాక్టర్లకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగలేదని తెలిసింది. ఇంకా 265 అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్.. అసంపూర్తిగా వున్న అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు పూర్తి చేయాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అసంపూర్తిగా వున్న అంగన్‌వాడీ కేంద్రాల భవనాలపై ప్రభుత్వానికి నివేదిక పంపామని పీఆర్ ఈఈ వీరన్నాయుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే భవన నిర్మాణ పనులు పునఃప్రారంభిస్తామని తెలిపారు.

రైలు ప్రయాణికులకు టికెట్ వెతలు

అనకాపల్లి స్టేషన్‌లో గతంలో రెండు బుకింగ్ కౌంటర్లు

- కరోనా ప్రబలినప్పుడు గూడ్స్‌షెడ్ వైపు కౌంటర్ మూసివేత
- నాలుగేళ్లు దాటినా పునఃప్రారంభించని అధికారులు
- ప్రధాన ద్వారంలో ఒకే ఒక్క టికెట్ కౌంటర్ వద్ద రద్దీ
- టికెట్ తీసుకుని 2, 3 ప్లాట్‌ఫారాలకు వెళ్లాలంటే అగచాట్లు
- గూడ్స్‌షెడ్ వైపు టికెట్ కౌంటర్‌ను కూడా అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు విజ్ఞప్తి



గూడ్స్‌షెడ్ వైపు మూసివేసిన టికెట్ కౌంటర్

అనకాపల్లి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో గూడ్స్‌షెడ్ వైపు ఉండే టికెట్ బుకింగ్ కౌంటర్ కొన్నేళ్లుగా మూతపడి ఉంది. దీంతో ఇటువైపు నుంచి స్టేషన్‌లోకి వచ్చే ప్రయాణికులు టికెట్ కోసం చుట్టూ తిరిగి ప్రధాన ద్వారంవైపు వెళ్లాల్సి వస్తున్నది. గతంలో ప్రధాన మార్గంలో ఒక టికెట్ కౌంటర్ మాత్రమే ఉండేది. 2018లో అప్పటి పార్లమెంట్ సభ్యుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు.. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి గూడ్స్‌షెడ్ వైపు టికెట్ కౌంటర్ ప్రారంభించారు. ఇది అనకాపల్లి, ఎలమంచిలి, మాడుగుల, చోడవరం, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలు మండలాలకు చెందిన ప్రయాణికులకు ఎంతో దోహదపడింది. ఈ నేపథ్యంలో 2020లో కరోనా వైరస్ ప్రబలడంతో రైల్వే శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గూడ్స్ షెడ్‌వైపు వున్న టికెట్ కౌంటర్‌ను మూసివేశారు. అప్పటి నుంచి రైల్వే స్టేషన్ ప్రధాన మార్గంలో ఉన్న టికెట్ బుకింగ్ కౌంటర్‌పై ప్రయాణికులు ఆధారపడుతున్నారు. కరోనా వైరస్ ప్రభావం తగ్గిపోయి మూడేళ్లు దాటినప్పటికీ గూడ్స్ షెడ్‌వైపున టికెట్ బుకింగ్ కౌంటర్‌ను వినియోగంలోకి తీసుకురాలేదు. స్టేషన్ ప్రధాన మార్గంలోని బుకింగ్ కౌంటర్‌లో టికెట్ తీసుకుని రైలు ఎక్కడానికి ప్లాట్‌ఫారంపైకి రావడానికి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. గూడ్స్‌షెడ్ వైపు టికెట్ కౌంటర్ ఉన్నప్పుడు ఇక్కడ టికెట్ తీసుకుని రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు సులువుగా రాకపోకలు సాగించే వారు. ఇప్పుడు ప్రధాన మార్గంలోని బుకింగ్ కౌంటర్ వద్దకు వెళ్లి టికెట్ తీసుకున్న తరువాత కాలినడక వంతెనపైకి ఎక్కి ప్లాట్‌ఫారాలకు చేరుకోవాల్సి వస్తున్నది. పైగా టికెట్ కౌంటర్ ఒక్కటే వుండడంతో క్యూలో నిల్చున్న తరువాత టికెట్ పొందడానికి ఎక్కువ సమయం పడుతున్నది. ఈలోగా రైలు వచ్చి, వెళ్లిపోతుండడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన వారికి దిక్కుతోచని



ఒకే ఒక్క టికెట్ కౌంటర్ వద్ద క్యూలో ప్రయాణికులు

... మిగతా 8వ పేజీలో

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బదిలీ

- మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా పోస్టింగ్
- నగర కమిషనర్‌గా ఇంకా ఎవరినీ నియమించని ప్రభుత్వం



సంపత్‌కుమార్

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (సీడీఎంఏ)గా నియమిస్తూ ఉత్తర్వులుజారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 25 మంది ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది.

2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంపత్‌కుమార్ గత ఏడాది జులై 20న జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. వివాద రహిత అధికారిగా సంపత్‌కుమార్ ... మిగతా 8వ పేజీలో

ఆహ్లాదం మాటున ప్రమాదం!

ప్రాణాంతకంగా రేవుపోలవరం సముద్ర తీరం

- రమణీయ ప్రదేశం కావడంతో తరలివస్తున్న పర్యాటకులు
- సరదాగా నీటిలో దిగితే.. ప్రాణాలు తీస్తున్న రాకాసి అలలు
- మూడు నెలల్లో నలుగురు మృత్యువాత
- బోర్డులకే పరిమితమైన హెచ్చరికలు
- మెరైన్ పోలీసులు మొక్కుబడిగా విధులు



రేవుపోలవరం సముద్ర తీరంలో ఆకస్మికంగా అలలు ఎగిసిపడే ప్రమాదకర ప్రదేశం (ఇన్‌సెట్) పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఎస్. రాయవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలతో అలరారే రేవుపోలవరం సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులను రాకాసి అలల రూపంలో మృత్యువు కబళిస్తున్నది. అప్పటి వరకు ప్రశాంతంగా వున్న సముద్రం.. ఒక్కసారిగా ఉగ్రరూపం దాలుస్తున్నది. తీరంలో సరదగా గడుపుతున్న వారిపై భారీ కెరటాలు విరుచుకుపడుతున్నాయి. దీంతో క్షణాల్లో నీటిలో మునిగిపోయి గల్లంతు అవుతున్నారు. కొంత మంది ప్రాణాలతో బయటపడుతుండగా, ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారు. దీంతో రేవుపోలవరం తీరంలో విహారానికి వచ్చిన వారు.. విషాదంతో తిరుగుముఖం పట్టాల్సి వస్తున్నది.

ఎస్.రాయవరం మండలంలోని రేవుపోలవరం సముద్రతీరం సహజసిద్ధమైన అందాలతో సందర్శకులను ఆకట్టుకుంటుంది. దీంతో సీజన్‌తో సంబంధం లేకుండా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాతో పాటు పక్కనే వున్న కాకినాడ జిల్లా నుంచి కూడా ఏడాది పొడవునా పర్యాటకులు వస్తుంటారు. అత్యధికులు ఇంటి వద్దనే భోజనాలు తయారు చేసుకుని ఉదయమే ఇక్కడకు చేరుకుని సాయంత్రం వరకు ఆహ్లాదంగా గడుపుతుంటారు. ముఖ్యంగా శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో ఇక్కడ పర్యాటకుల తాకిడి అధికంగా వుంటుంది. తీరం మొత్తం జనసంద్రంగా మారుతుంది. ఎడమవైపున సముద్రం చంద్రవంక ఆకారంలో తీరం వైపునకు చొచ్చుకు రావడంతో ఇక్కడ సముద్ర లోతు తక్కువగా వుంటుంది. దీంతో పలువురు ఇక్కడ నీటిలో దిగి సరదాగా గడుపుతుంటారు. ఇక్కడ కొండగుట్టకు ఇరువైపు రాళ్ల తేలిన ప్రదేశం

... మిగతా 8వ పేజీలో



సముద్రంలోకి చొచ్చుకుపోయిన రాళ్ల గుట్టలు. ఇది అత్యంత ప్రమాదకర ప్రదేశంగా పోలీసులు గుర్తించారు

వంటగ్యాస్ అక్రమ వసూళ్లపై చర్యలు

- గ్యాస్ ఏజెన్సీ నుంచి 15 కి.మీ.ల వరకు సిలిండర్ ఉచిత డెలివరీ
- అంతకు మించితే రూ.30 మాత్రమే వసూలు చేయాలి
- అందుబాటులో 1800 2333555 టోల్‌ఫ్రీ నంబర్
- జాయింట్ కలెక్టర్ జాహ్నవి



జాహ్నవి, జేసీ

అనకాపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుపేదల కోసం దీపం-2 ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నదని, లబ్ధిదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి ఒక ప్రకటనలో హెచ్చరించారు. వంట గ్యాస్ సిలిండరు డెలివరీ సమయంలో రవాణా చార్జీల పేరుతో అదనంగా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలని అన్నారు. నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీ నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో వున్న గృహాలకు సిలిండర్‌ను ఉచితంగా డెలివరీచేయాలని, అంతకు మించితే రూ.30 మాత్రమే వినియోగదారులు చెల్లించాలని ఆమె స్పష్టం చేశారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్‌లు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ విషయంలో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులే బాధ్యత వహించాలన్నారు. పౌరసరఫరాల అధికారులు కూడా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, గ్యాస్ డెలివరీ బాయ్‌లు అక్రమ వసూళ్లకు పాల్పడకుండా నియంత్రించాలని ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీలు లేదా సిలిండర్ డెలివరీ బాయ్స్ అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టయితే పౌర సరఫరాల శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1967కు లేదా చమురు కంపెనీల ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1800 2333555కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని జేసీ సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలపై ఇంటింటా సర్వే

- వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహణ
- పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కుష్ఠువ్యాధి నిరోధానికి సర్వే నిర్వహించనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. 'లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్-2025)' పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు కుష్ఠుబారిన పడిన వారిని గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్టు చెప్పారు. సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి, అందరినీ పరీక్షించాలన్నారు. అనుమానిత కేసులను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి పంపించాలని సూచించారు. కుష్ఠు లక్షణాలు కనిపించిన వారికి చికిత్స అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లలో క్యూ ఆర్ కోడ్

ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజాభిప్రాయ సేకరణ



అన్న క్యాంటీన్‌లో భోజనం చేయడానికి క్యూలో నిల్చున్న జనం. (ఇన్‌సెట్) అన్న క్యాంటీన్ వద్ద క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న యువకుడు

ఎలమంచిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లలో ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, క్యాంటీన్ల నిర్వహణ తీరుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నది. ఇందుకోసం ఆయా క్యాంటీన్ల వద్ద క్యూ ఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసి, భోజనం చేయడానికి వచ్చే వారి అభిప్రాయాలను కోరుతున్నది.

పట్టణ ప్రాంతాల్లో నిరుపేద కార్మికులు, దినసరి కూలీల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం 'అన్న క్యాంటీన్'లను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ ఐదు రూపాయలకే ఉదయం అల్పాహారం/ మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతున్నారు. భోజన సరఫరా బాధ్యతను స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. అయితే అల్పాహారం, భోజనం నాణ్యతపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాలని ప్రభుత్వం భావించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని నిర్ణయించింది. డిజిటల్ లావాదేవీల తరహాలో

... మిగతా 8వ పేజీలో

వెంకన్న ఆలయంలో గ్రానైట్ పనులు


ఆలయ ఆవరణలో గ్రానైట్ పనులు చేపడుతున్న దృశ్యం

నక్కపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొన్ని రోజులుగా గ్రానైట్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.30 లక్షలతో టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఆలయ గర్భగుడి చుట్టూ గ్రానైట్‌ను అమర్చుతున్నారు. ఆలయ ప్రాకారం (బేడామండపం కింద) చుట్టూ గ్రానైట్ పనులు పూర్తయ్యాయి. గతంలో ఆలయ గర్భగుడి చుట్టూ దాతల సహకారంతో టైల్స్ ఏర్పాటు చేశారు. ఎండలు ఎక్కువగా వున్న సమయంలో ప్రదక్షిణ చేసే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ఇప్పుడు ఆ టైల్స్‌ను తొలగించి, వాటి స్థానంలో గ్రానైట్ అమర్చుతున్నారు. ప్రస్తుతం ఈ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి.

ఘనంగా కొత్తమ్మతల్లి తీర్థం


కొత్తమ్మతల్లికి పూజలు చేసిన భక్తులు

రాంబిల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదకలవలాపల్లి గ్రామంలో కొత్తమ్మతల్లి తీర్థాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించి, తమ మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్‌లు కె.సన్నిబాబు, వై.దేముళ్లు, సర్పంచ్ వై.కనకారావు, మాజీ సర్పంచ్ కె.ప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మాజీ కౌన్సిలర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే సుందరపు


మీనా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొక్కిరాపల్లి వార్డు మాజీ కౌన్సిలర్ మజ్జి మీనా ఇటీవల మృతి చెందడంతో ఆమె భర్త మజ్జి వీరబాబు, కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరామర్శించారు. మీనా మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. వీరబాబు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణలను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, శ్రీను, రమణ పాల్గొన్నారు

'కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'


ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకి వినతి పత్రం అందజేస్తున్న కల్లు గీత కార్మిక సొసైటీల నాయకులు

పాయకరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సొసైటీల నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సొసైటీ నాయకులు దమ్ము అప్పారావు, గుత్తుర్తి పాండురంగా తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యం షాపుల్లో గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెట్టుపై నుంచి పడిపోయి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా గీత కార్మికులకు జీవన భృతి అమలుచేయాలని, సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని, ఐడీ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమాగా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. అనంతరం ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీల నాయకులు దుంగా అప్పలరాజు, పాలకి వెంకన్న, బత్తిన సత్యనారాయణ, దమ్ము రాజు, పి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు శ్రద్ధ చూపాలి

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

మునగపాక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలోను పారిశుధ్యం మెరుగుపై అధికారులు, పాలకవర్గాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశించారు. మండలంలో తిమ్మరాజుపేటలో సోమవారం ఆయన పర్యటించారు. వీధులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆక్రమణలపై ఆరా తీశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్న రోజునే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అవుతుందన్నారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ బీమరశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బీవీ.రమణ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషిచేయాలి

రాంబిల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని 10 సచివాలయాల్లో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని ఎండీటీ ద్వారా నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగుతుందని అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కాలువలకు మంచి రోజులు

- శిథిలమైన స్లూయిజ్‌ల నిర్మాణానికి నిధులు
- తొలి విడతగా రూ.31.42 లక్షలు విడుదల

పాయకరావుపేట రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి కాలువలకు మంచి రోజులు వచ్చాయి. మదుములు, తలుపులు శిథిలమైన సాగునీటి కాలువలను అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విడతల వారీగా నిధులు మంజూరు చేస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం ఒక రూపాయి కూడా సాగునీటి కాలువలకు ఖర్చు చేయలేదు. శిథిలమైన స్లూయిజ్‌లతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి మొదటి విడతగా మదుములు, తలుపులు నిర్మించడానికి రూ.31.42 లక్షలను మంజూరు చేశారు. ఈ నిధులతో తలుపులు పూర్తిగా దెబ్బతిన్న గోపాలపట్నం, శ్రీరాంపురం, మాసాహెబ్‌పేట, తదితర ప్రాంతాలలో 11 చోట్ల తలుపులు ఏర్పాటు చేయడానికి ఇప్పటికే అగ్రిమెంట్లు చేసుకున్నట్టు సాగునీటి శాఖ ఏఈఈ జి.శ్రీరామ్మూర్తి తెలిపారు. అలాగే రాష్ట్ర హోం మంత్రి అనిత


శ్రీరాంపురం వద్ద దెబ్బతిన్న తలుపులు, మదుములు

జిల్లా కలెక్టరు దృష్టికి కాలువల దుస్థితిని తీసుకెళ్లారన్నారు. కలెక్టర్‌కు రూ.70లక్షల సీఎస్‌ఆర్ నిధులతో 20 పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించామని, ఆ నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభిస్తామన్నారు. వీటిలో 13 చోట్ల తలుపులు, 6 మదుములు నిర్మిస్తామన్నారు. అదేవిధంగా మంగవరం కాలువ కింద గుంటపల్లి వద్ద రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో పనులు ప్రారంభిస్తున్నారన్నారు. భూమి కాలువ కింద రూ.9.3 కోట్లు, ముతా కాలువ కింద రూ.5.2 కోట్లతో పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

కూటమి ప్రభుత్వంలో సాగునీటి కాలువల అభివృద్ధి

గూటూరు రామగోవిందు, అధ్యక్షుడు, మంగవరం నీటి సంఘం



సాగునీటి కాలువల స్లూయిజ్‌లు శిథిలమై అధ్వానంగా ఉన్నాయి. పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి కాలువలపై శిథిలమైన మదుములు, తలుపులు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి. గుంటపల్లికి వెళ్లే సాగునీటి కాలువలో రూ.10 లక్షలతో పనులను ప్రారంభిస్తున్నాం.

టీచర్ అవతారమెత్తిన ఎమ్మెల్యే

- టెన్త్ విద్యార్థినులకు పాఠాలు చెప్పిన సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం ఉపాధ్యాయుడి అవతామరమెత్తారు. సుమారు గంటపాటు టెన్త్ విద్యార్థులకు బోధన చేశారు. సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పట్టణంలోని తులసీనగర్ బాలికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి, టీచర్లతో మాట్లాడారు. అనంతరం టెన్త్ విద్యార్థినులకు ఆయన పాఠాలు బోధించారు. అలాగే విద్యార్థినుల ప్రతిభను పరిశీలించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు సక్రమంగా వింటూ అర్థం చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటపాటు విద్యార్థినులతో గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో కూటమి ప్రభుత్వం ఎన్నో మార్పులు తీసుకువస్తుందన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ప్రణాళికాబద్ధంగా ప్రక్షాళన చేస్తున్నారన్నారు. అనంతరం ఉపాధ్యాయునిలతో మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నేతలు లవుడు లోవరాజు, శ్రీను మాస్టారు, ఆడారి ఆదిమూర్తి తదితరులు ఉన్నారు.


ఎలమంచిలిలో టెన్త్ విద్యార్థినులకు పాఠాలు చెబుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఘనంగా ఆడారి ఆనంద్ జన్మదిన వేడుకలు

- రోగులకు, అనాథలకు పండ్లు, స్వీట్లు పంపిణీ

ఎలమంచిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ జన్మదిన వేడుకలను సోమవారం ఎలమంచిలిలో ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆనంద్ అభిమానులు, సన్నిహితుల సమక్షంలో ఆడారి వెంకట్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్ ఆనంద్ సేవలను పలువురు కొనియాడారు. అనంతరం సీహెచ్‌సీలోని రోగులకు, కొక్కిరాపల్లి ప్రేమసమాజంలోని అనాథలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టరు ములంపాక నానాజీ, రామారాయుడుపాలెం పాల సంఘం అధ్యక్షుడు సుంకర కృష్ణ వెంకటగిరి, ఆయన అభిమానులు దాడి నాయుడు, మళ్ల శివ, జెర్రిపోతుల అప్పారావు, దొడ్డి వెంకటేష్, డెయిరీ జేవో శ్రీను, కరెడ్ల మల్లిబాబు, సియ్యాద్రి శ్రీను, వేగి వెంకటేష్, ఆడారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొక్కిరాపల్లి ప్రేమసమాజంలోని అనాథలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆడారి వెంకట్


విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ జన్మదిన వేడుకల కేక్ కట్ చేసిన ఆడారి వెంకట్ తదితరులు

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పశువైద్య శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు

పాయకరావుపేట రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించనున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మాసాహెబ్‌పేటలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువైద్య శిబిరాల్లో పశువులు, దూడపెయ్యిలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఇవ్వడంతోపాటు గొర్రెలు, మేకలు, కోళ్ళకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు, పాడిరైతులు పాల్గొన్నారు.

మునగపాకలో..

పాడి పశువులకు పాల, రక్త, పేడ పరీక్షలను ఉచితంగా చేస్తామని స్థానిక మండల పశువైద్యాధికారి ఎల్.ప్రదీప్‌కుమార్ తెలిపారు. మునగపాక ముసిలితల్లి రైతు మూల ప్రాంతంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా పాల దిగుబడులను అధికంగా పొందవచ్చునని చెప్పారు. నట్టల నివారణ మందులను పశువులకు వేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు, జనసేన పార్టీ నాయకుడు వేగి కృష్ణ, మూల సంఘం అధ్యక్షుడు పొలమరశెట్టి అప్పలనాయుడు, మారిశెట్టి అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.


నక్కపల్లి: జానకయ్యపేటలో పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



మునగపాక: పశువైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రదీప్‌కుమార్

అచ్యుతాపురం రూరల్‌లో..

మండలంలో జరిగే ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగ పరచుకోవాలని పశు వైద్యాధికారి జగదీష్ కోరారు మండలంలోని తిమ్మరాజుపేటలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 70 పశువులకు నట్టల నివారణ, 15 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 15 పశువులకు సాధారణ చికిత్సలు, 6 చూడి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 10 పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు భీమిశెట్టి రాము, ఆడారి లక్షణరావు, శరగడం శివ బాపునాయుడు, ఆడారి అర్జున్, గోపాలమిత్ర సత్యనారాయణ, శరగడం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని దేవవరం, జానకయ్యపేట గ్రామాల్లో సోమవారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. పశువైద్య శాఖ ఏడీ డాక్టర్ వీర్రాజు పాడి రైతులకు ఈ పశు ఆరోగ్య శిబిరాల గురించి వివరించారు. పాడి పశువుల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం చేపట్టే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. పశువులకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

బాక్సింగ్ చాంపియన్ అనితకు ఆర్థిక సాయం

పాయకరావుపేట రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గోవాలో ఇటీవల జరిగిన జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన ఈదటం గ్రామానికి చెందిన కొరుప్రోలు అనితకు సోమవారం అదే గ్రామానికి చెందిన గణసాల మోహనరంగ, గుడెపు లోకనాథ్, శృంగవరపు లోవసత్యనారాయణ రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొరుప్రోలు అనిత మాట్లాడుతూ వచ్చే నెలలో నేపాల్ దేశంలో జరగనున్న అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు తనకు సుమారు రూ.2 లక్షలు అవసరం అవుతుందన్నారు. సోమవారం తమ వంతు సాయంగా రూ.20వేలు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆమె తెలిపారు.


కొరుప్రోలు అనితకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

దట్టంగా పొగమంచు

కోటవురట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజుల నుంచి పొగమంచు దట్టంగా కురుస్తున్నది. అర్ధరాత్రి దాటిన తరువాత మొదలవుతున్న మంచు.. ఉదయం తొమ్మిది గంటల వరకు కొనసాగుతున్నది. శివారు ప్రాంతాల్లో దట్టంగా కురుస్తున్న మంచు దృశ్యాలు ఏజెన్సీని తలపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగిస్తు న్నారు. మంచు కారణంగా పొలం పనులు కొంత ఆలస్యంగా మొదలవుతున్నాయి. అధిక పొగమంచు కారణంగా మామిడి తోటల్లో పూత మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


కోటవురట్లలో ఉదయం 8.30 గంటలకు వీడని పొగమంచు

హరిపాలెంలో సైన్స్ ప్రయోగాల పోటీలు

- జన విజ్ఞాన వేదిక గోడ పత్రిక ఆవిష్కరణ

అచ్యుతాపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించబోయే సైన్స్ ప్రయోగాల పోటీలకు సంబంధించి గోడపత్రికను సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తుల రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు ఆవిష్కరించారు. ఈ పోటీల ద్వారా పిల్లలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచన రేకెత్తించడమే ప్రధాన లక్ష్యమన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం-సుస్థిరాభివృద్ధి, మూఢ నమ్మకాలు-శాస్త్రీయ దృక్పథం అనే మూడు అంశాలపై 5 నిమిషాల ప్రయోగ వీడియోలను ఫిబ్రవరి 15వ తేదీలోగా పంపించాలన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు బొడ్డేడ రామ్‌కుమార్, బొప్పా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


గోడ పత్రికను విడుదల చేస్తున్న జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

శ్రీరాంపురంలో భూముల రీ సర్వే ప్రారంభం

పాయకరావుపేట రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరాంపురం రెవెన్యూ గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వేని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం భూముల రీ సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ గ్రామంలో పక్కా రికార్డులు రూపొందించడం కోసం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు,టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, చించెలపు పద్దు పాల్గొన్నారు.


శ్రీరాంపురంలో రీ సర్వే ప్రారంభించిన సర్పంచ్ గారా కృష్ణప్రసాద్

ఇంటర్వ్యూ..

పీహెచ్‌సీలో రోజుకు 150 ఓపీ ఉంటుంది..

డాక్టర్ అనిల్‌కుమార్, రాంబిల్లి పీహెచ్‌సీ



(ఆంధ్రజ్యోతి/రాంబిల్లి)

ప్రశ్న: రాంబిల్లి పీహెచ్‌సీలో రోజూ ఓపీ ఎంత ఉంటుంది.?

జవాబు: పీహెచ్‌సీలో ప్రతి రోజూ 100 నుంచి 150 వరకు ఓపీ ఉంటుంది.

ప్రశ్న : పీహెచ్‌సీలో ఎన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.?

జవాబు : పీహెచ్‌సీలో 63 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : మందుల కొరత ఉందా?

జవాబు: మందుల కొరత లేదు. మందులన్నీ ఉన్నాయి.

ప్రశ్న: 108 అంబులెన్స్ ఉందా...?

జవాబు: రాంబిల్లి పీహెచ్‌సీ పరిధిలో 108 అంబులెన్స్ సౌకర్యం లేదు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు, ఎలమంచిలి ఎమ్మెల్యేకు తెలియజేశాను.

ప్రశ్న : పీహెచ్‌సీ ద్వారా గ్రామాల్లో 140 సేవలు అందుతున్నాయా...?

జవాబు: నెలలో 19 రోజులుపాటు గ్రామాల్లో 104 సేవలు అందిస్తున్నాం..

ప్రశ్న : కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేస్తున్నారా?

జవాబు: గతంలో ఎస్‌హెచ్‌ఎం డాక్టర్‌లు ఉండటం వలన కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేసేవారు. ఆ డాక్టర్‌లు లేకపోవడంతో రెండు నెలలు కాలంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయడం లేదు.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా...?

జవాబు : పీహెచ్‌సీలో ఏడాది కాలంగా ఒక స్టాఫ్ నర్సు కొరత ఉంది. ఈ విషయంను ఉన్నతాధికారులకు తెలిపాను.

గోపాల మిత్రలకు ఆరు నెలలుగా అందని గౌరవ వేతనం

అచ్యుతాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు గత ఆరు నెలలుగా గౌరవ వేతనం అందలేదు. దీంతో వారు సంక్రాంతి పండుగకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 150 మంది వరకు గోపాల మిత్రలున్నారు. వీరికి నెలకు రూ.6,500 గౌరవ వేతనం ఇస్తున్నారు. గత వైసీపీ సర్కారు చర్యలతో నిర్వీర్యమైన గోపాల మిత్ర వ్యవస్థ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా మంచి జరుగుతుందని భావించారు. కాని ఆరు నెలల నుంచి వీరికి గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు. కొత్త ప్రభుత్వం వచ్చింది. త్వరలో నిధులు విడుదల చేస్తామంటూ కాలయాపన జరిగిందని గోపాల మిత్రలు వాపోతున్నారు. సంక్రాంతికైనా వస్తాయని ఆశతో ఎదురుచూశామని, కాని ఇంతవరకు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాల్సిన సంక్రాంతి పండగ పస్తులతో గడిపామని ఆవేదన వ్యక్తం చేశారు.

దొంగ అరెస్టు

అచ్యుతాపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదిలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ నమ్మి గణేష్ తెలిపారు.మండలంలోని జంగులూరు జంక్షన్ వద్ద సోమవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న పూడిమడక శివారు కొండపాలెంకు చెందిన చోడిపల్లి గంగరాజు(19)ను పట్టుకుని విచారించగా దొంగతనం చేసినట్టు అంగీకరించారన్నారు. అతని వద్ద తులం బంగారు చైను రికవరీ చేసి, సెల్‌ఫోను సీజ్ చేశామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ గణేష్ తెలిపారు.

చినబొడ్డేపల్లిలో భూ రీసర్వే

కోటవురట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినబొడ్డేపల్లి గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ తిరుమలరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మండలంలో చినబొడ్డేపల్లి గ్రామాన్ని భూ రీసర్వేకు పెలట్ ప్రాజెక్టుగా తీసుకున్నామన్నారు. రీసర్వేలో సాగురైతులనుబాగస్వా ములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రమేష్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ శిథిల బ్రిడ్జిని తొలగించాలి

మునగపాక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంతబయల ములబందగోడి చాకిరేవు వద్ద అనకాపల్లి ఆవ కాలువ ఫుట్‌పాత్ బ్రిడ్జి శిథిలభాగం తొలగింపునకు నోచుకోలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ పైలా అప్పలనాయుడు ములబందగోడి రైతులతోపాటు మూలపేట గ్రామానికి వెళ్లేందుకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. బ్రిడ్జి లోతట్టుగా ఉండటం వలన వర్షాలు విస్తారంగా కురిసే సమయంలో నీటితో బ్రిడ్జి మునిగిపోతూ ఉండేది. సమస్య తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం, పాలకులు కొత్త బ్రిడ్జిని నీటి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఎత్తుగా నిర్మించారు. పాత ఫుట్‌పాత్ బ్రిడ్జిలో కొంత భాగాన్ని అప్పట్లో తొలగించారు. మిగిలిన అధిక భాగం దశాబ్దాలవుతున్నా తొలగింపునకు నోచుకోలేదు. దీంతో ఎగువ భాగంలో కాలువకు గండి పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చొరవ చూపి బ్రిడ్జి శిథిల భాగాన్ని తొలగించాలని కోరుతున్నారు



గోమాతను పూజించి పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి

- మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి
- పలు మండలాల్లో పశువైద్య శిబిరాలు

చీడికాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. సోమవారం అన్ని మండలాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహించారు. చీడికాడ మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే బండారు గోమాతకు వందనం చేసి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పాడి పశువులు, పెయ్యిలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను ఆయన అందించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.రామ్మోహన్‌రావు, సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు శిబిరాలు జరుగుతాయని చెప్పారు. పెదగోగాడ పశు వైద్యాధికారి రాఘవమ్మ మాట్లాడుతూ 15 పశువులకు సాధరణ, 25 పశువులకు గర్భకోశ, 15 పెయ్యిలు, 21 పశువులకు నట్టల నివారణ మందులు, 310 గొర్రెలకు మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.గణేశ్, మాజీ సర్పంచ్ పి.ఎర్రునాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ ఎస్.సూర్యనారాయణ, ఎంపీడీవో హేమసుంద్రరావు, టీడీపీ నేతలు రెడ్డి రాము, కొండబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో సోమవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 56 పశువులకు నట్టల నివారణ మందు అందించారు. 33 పశువులకు గర్భకోశ వ్యాధిపై చికిత్స 92 కోళ్లకు వైద్యం చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ ఏడీఏ రాంబాబు, పశు వైద్యాధికారి పుష్ప, తదితరులు పాల్గొన్నారు.



చెట్టుపల్లిలో మేకలకు సేవలు అందిస్తున్న వైద్యులు

రావికమతం: మండలంలోని చినపాచిల, గుమ్మాళ్లపాడు గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలు జరిగాయి. రావికమతం, రోలుగుంట మండలాల్లోని అన్ని గ్రామాల్లో నెలాఖరు వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాల్లో 18 గొడ్డు మోతు పశువులకు, పది పశువులకు చూడి తనిఖీలు, రెండు కృత్రిమ గర్భధారణ, 11 గర్భాశయ వ్యాధులకు వైద్య సేవలు అందించారు. 106 పశువులు, దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు టి.పుష్ప, పశు వైద్యులు జి.లోకేశ్, మౌనిక, సర్పంచ్ కోమటి రామలక్ష్మి, ఉప సర్పంచ్ కె.శంకరరావు, ఎంపీటీసీ సభ్యులు ఎం.భవాని, బి.సన్యాసినాయుడు, బి.లక్ష్మి పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలో కాశీపురం, తిమిరాంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 1528 పశువులకు పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు మంజుషారాణి, జి.ప్రియాంక మాట్లాడుతూ నట్టల నివారణ, గర్భకోశ వ్యాధి నిరోధక టీకాలు వేశామని చెప్పారు. సర్పంచ్ వరలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు సూర్యనారాయణ, సింహాచలంనాయుడు, రాయపురెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మండలంలోని పోతనపూడి అగ్రహారం, డి.సురవరం గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 23 పశువులకు సాధారణ, 26 పశువులకు గర్భకోశ చికిత్సలు, రెండు పశువులకు కృత్రిమ గర్భాధారణ, 23 పశువులకు చూడి పరీక్షలు, 42 పశువులకు, 46 పెయ్యిలకు, 393 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులను అందించినట్టు పశు సంవర్థక శాఖ ఏడీ చిట్టినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు మణి లక్ష్మణ్, అరుణకిరణ్, నాయకులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం: మండలంలోని గుమ్మిడిగొండ గ్రామంలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. 30 పశువులకు వ్యాక్సిన్‌లు, పది పశువులకు డీవార్మింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుర్ల వెంకటరమణ, కూటమి నాయకులు చింతకాయల ప్రశాంత్, సుర్ల అచ్చియ్యనాయుడు, శెట్టి శ్రీను, పశు వైద్య సిబ్బంది ఎ.అభి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండంలోని శెట్టిపాలెం, కొండలఅగ్రహారం గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. కోళ్లు, మేకలు, గొర్రెలు, ఆవులు, గెదెలు తదితర పశువులకు ఈ శిబిరాల్లో ఉచితంగా టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్టు పశు సంవర్థక శాఖ ఏడీ పి.నరేష్ తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యులు మణిదీప్, అనిల్ పాల్గొన్నారు.

గొలుగొండ: మండల కేంద్రంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 65 పశువులకు, 30 మేకలకు, 15 ఆవులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసినట్టు పశువైద్యాధికారి రమేశ్ తెలిపారు. లేగదూడలకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశామన్నారు.

రోలుగుంట: రొంగలిపాలెం గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 గొర్రెలు, మేకలకు, 85 పెద్ద పశువులకు నులిపురుగుల మందులను వేశారు. అలాగే అనారోగ్యంతో ఉన్న పశువులకు పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో కుసర్లపూడి పశువైద్యాధికారి సురేశ్, సిబ్బంది పైల వల్లిక, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో వ్యవసాయానికి మేలు

కె.కోటపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో వ్యవసాయానికి ఎంతో మేలు చేకూరుతుందని మండల ప్రత్యేకాధికారి పూర్ణిమదేవి చెప్పారు. సోమవారం సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన జరిగింది. డి.అగ్రహారం, ఆర్‌పై అగ్రహారం గ్రామాలకు చెందిన క్లాప్ మిత్రలు కొబ్బరి, అరటి, క్యాబేజీని ఈ ప్రదర్శనలో ఉంచారు. స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, మండల కో-ఆర్డినేటర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు మతిస్థిమితం లేని యువకుడి అప్పగింత

చోడవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సొంత రాష్ట్రం నుంచి తప్పిపోయి పట్టణంలో మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్నబిహార్‌కు చెందిన యువకుడిని స్థానిక పోలీసులు సోమవారం అతని కుటుంబీకులకు అప్పగించారు. బిహార్ రాష్ట్రం నలంద జిల్లాకు చెందిన మహ్మద్ తౌఫిక్ అనే యువకుడు సొంత రాష్ట్రం నుంచి పనుల కోసం వచ్చి మతిస్థిమితం కోల్పోవడంతో కొద్దిరోజులుగా చోడవరం ప్రాంతంలో తిరుగుతున్నాడు. అతనిని గమనించిన పోలీసులు వివరాలు రాబట్టి, అత ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. యువకుడి కుటుంబ సభ్యులు సోమవారం చోడవరం రావడంతో వారికి అతనిని అప్పగించారు.

పీఎం ఇంటర్న్ షిప్ దరఖాస్తుకు నేటి వరకు గడువు: జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం ఇంటర్న్ షిప్ పథకం నమోదుకు ఈ నెల మంగళవారం ఆఖరు రోజని, జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పిలుపునిచ్చారు. ఇక్కడి కలెక్టరేట్‌లో సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సాధ్యమైనంత ఎక్కువ మంది యువత ఈ పథకాన్ని వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు మాట్లాడుతూ ప్రతి ఇంటర్న్‌కు 12 మాసాల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్ అనంతరం పలు కంపెనీలలో ఉపాధి అవకాశం కల్పించనున్నట్టు చెప్పారు.

అక్కరకురాని సంపద కేంద్రం

- ఎన్.కొత్తూరులో నిర్లక్ష్యంగా వదిలేసిన అధికారులు
- అడ్డాగా మార్చుకున్న మందుబాబులు
- లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం వృథా

ఎన్.కొత్తూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. అధికారుల అలక్ష్యంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. చివరికి ఆకతాయిలకు అడ్డాగా మారిపోయింది.

రోలుగుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):

టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని దాదాపు అన్ని పంచాయతీల్లో రూ.5 నుంచి రూ.10 లక్షలు వెచ్చించి సంపద కేంద్రాలను నిర్మించారు. అలాగే చెత్త తరలించేందుకు మూడు చక్రాల సైకిళ్లను కూడా పంపిణీ చేశారు. పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఈ కేంద్రాల్లో వేసి, వాటి ద్వారా ఎరువును ఉత్పత్తి చేసిన రైతులకు పంపిణీ చేయాలి. కాని ఎక్కడా లక్ష్యం అమలు కావడం లేదు. గ్రామాల్లో సేకరించిన చెత్తను కొన్ని చోట్ల సంపద కేంద్రాల్లో వేస్తున్నా, మరికొన్ని గ్రామాల్లో రోడ్లపైనే వేసి నిప్పు పెడుతున్నారు. దీంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉత్పన్నమవుతోంది. కాగా కొన్ని కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారాయి.

ఎన్.కొత్తూరు గ్రామ శివారున రోడ్డును ఆనుకుని నిర్మించిన చెత్త సంపద కేంద్రం సాయంత్రమైతే మందుబాబులకు అడ్డాగా మారుతోంది. ఎక్కడ చూసిన మద్యం



ఎన్.కొత్తూరు శివారున రహదారిపైనే చెత్త వేసి తగులబెడుతున్న దృశ్యం



ఎన్.కొత్తూరులో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం

సీసాలు, బీరు బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. ఎంతో ఉన్నత లక్ష్యంతో నిర్మించిన ఈ చెత్త సంపద కేంద్రాలు ఇలా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారడంపై స్థానిక ప్రజలు విస్మయం చెందుతున్నారు. ఈ కేంద్రాలను గ్రామ శివారున నిర్మించడంతో మందుబాబులు తమ కార్యకలాపాలను వినియోగించుకుంటున్నారని వారు చెబుతున్నారు. ప్రతీ రోజు చీకటి పడితే గుంపులు గుంపులుగా చేరి మద్యం తాగుతున్నారని, వారు తాగిపడేసిన సీసాలు అక్కడ పేరుకుపోతున్నాయని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ గ్రామ పంచాయతీ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలోనైనా వినియోగంలోకి వచ్చేనా..?

ఐదేళ్ల వైసీపీ పాలనలో చెత్తతో సంపద కేంద్రాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారు. కేంద్రాలకు వైసీపీ రంగులు వేయడం తప్ప సంపద తయారీ లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపద కేంద్రాలను ఎప్పుడు వినియోగంలోకి తీసుకువస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇంటింటికీ చెత్త సేకరించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం: ఎంపీడీవో నాగేశ్వరరావు

నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తామని ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. కొన్ని కేంద్రాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై తగిన నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పంచాయతీల్లో పక్కాగా పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

ఓటమితో రాజకీయాలకు దూరం కావాలనుకున్నా..

- 31న పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతల స్వీకరణ
- అమర్‌తో కలిసి పనిచేస్తా: ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ

చోడవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ జీవితంలో ఎక్కువసార్లు ఓటములే ఎదురయ్యాయని, అసెంబ్లీ ఎన్నికల పరాజయంతో రాజకీయాలకు దూరం కావాలనుకున్నానని, అయితే పార్టీ అధినేత ఆదేశాలతో తిరిగి అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించుకున్నానని ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చోడవరం, మాడుగుల ప్రాంతాల్లో ఐదుసార్లు పోటీ చేస్తే మూడు సార్లు ఓటమి ఎదురైందని, ఇక తాను రాజకీయాల్లో కొనసాగడం వృథా అన్న నిర్ణయానికి వచ్చానన్నారు. పార్టీ అధినేత జగన్‌తో పాటు జిల్లాలోని ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా అనకాపల్లి పార్లమెంట్ బాధ్యతల కోసం తన పేరును సూచించడం, పార్టీ అధినేత నిర్ణయం తీసుకోవడంతో రాజకీయాల్లో కొనసాగాలన్న నిర్ణయానికి వచ్చానన్నారు. ఈ నెల 31న అనకాపల్లిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో జిల్లా సమావేశం నిర్వహిస్తున్నామని, అక్కడ నూతన బాధ్యతలు స్వీకరిస్తానని ఆయన తెలిపారు. అలాగే చోడవరం ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ మంత్రి అమర్ కూడా ఈ నెల 24న బాధ్యతలు చేపడతారని, ఆయనతో కలిసి పనిచేస్తూ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాని ధర్మశ్రీ తెలిపారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, జిల్లా వైసీపీ యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేశ్, శ్రీకాంత్, ఎంపీపీ గాడి కాసు, పల్లా నరసింగరావు, డీవీ ఆర్, సేనాపతి సత్యారావు, పి. అప్పారావ్ యాదవ్, బొడ్డేడ సూర్యనారాయణ, నెహ్రూ, చందు రాంబాబు, కోన చంద్రరావు, బుద్ధ గంగరాజు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ

అర్జీల పరిష్కారానికి చర్యలు: ఆర్డీవో రమణ

నర్సీపట్నం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఆర్డీవో వీవీ.రమణ తెలిపారు. నర్సీపట్నం ఆర్డీవో కార్యాలంలో సోమవారం ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. భూ సమస్యలపై ఆరు దరఖాస్తులు వచ్చాయని, వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించండి

- ఆక్రమణదారులకు ఎంపీడీవో వెంకన్నబాబు నోటీసులు

రావికమతం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ స్థలంలో ఆక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలని, లేకుంటే తామే తొలగిస్తామని ఎంపీడీవో వెంకన్నబాబు ఆక్రమణదారులకు సోమవారం నోటీసులు జారీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ప్రహరీని ఆనుకుని ముందు భాగంలో బీఎన్ రోడ్డుకు ఎదురుగా సగ భాగంలో కఠంరెడ్డి నాయుడు, వై.నాగభూషణం, డి.దేముడు, కె.సత్యారావు, బి.సత్యారావు, పి.గణేశ్ బడ్డీలను ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. వాటిని రోడ్డు విస్తరణలో భాగంగా 2023లో తొలగించారు. ఇటీవల వారు మళ్లీ శాశ్వత నిర్మాణాలు చేసుకుని దుకాణాలు నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ స్థలంలో శాశ్వత నిర్మాణాలు వద్దని ఎంపీడీవో అభ్యంతరం తెలిపినా పట్టించుకోకపోవడంతో, తక్షణమే తొలగించాలని ఆయన నోటీసులు జారీ చేశారు. స్వచ్ఛందంగా తొలగించకపోతే తామే యంత్రాలతో తొలగిస్తామని ఎంపీడీవో హెచ్చరించారు. కాగా గత 20 ఏళ్లుగా ఇక్కడే జీవనోపాధి పొందుతున్నామని, ఎవరూ అభ్యంతరం తెలపకపోయినా ఎంపీడీవో కక్ష సాధింపు చేస్తుండడం బాధాకరమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించాలి

చీడికాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో జరిగే సోషల్ ఆడిట్ కార్యక్రమానికి అందరూ సహకరించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ బండారు శ్రీనివాసరావు కోరారు. 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి 31 వరకూ జరిగిన వివిధ పనుల ఆడిట్ కోసం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆడిట్ గురించి వివరిస్తూ అందరూ సహకరించాలని ఏపీడీ కోరారు. సమావేశంలో ఎంపీపీ కురచా జయమ్మ, ఎంపీడీవో హేమసుంద్రావు, ఏపీవో గంగునాయుడు పాల్గొన్నారు.

వెంకటరమణ మృతి తీరని లోటు: ఎమ్మెల్యే రాజు

రోలుగుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నక్కా వెంకటరమణ మృతి తీరని లోటని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు పేర్కొన్నారు. కంచుగుమ్మలో సోమవారం నిర్వహించిన సంతాప సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మృతి విచారకరమని, పార్టీ తరపున కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.చంద్రమౌళి, సర్పంచ్ బి.శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు పి.నారాయణదొర, పరవాడ నూకరాజుదొర పాల్గొన్నారు.

నాయుడుబాబుకు నివాళులు

నర్సీపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతిలో ప్రమాదవశాత్తు మృతిచెందిన బొడ్డేటి నాయుడుబాబుకు కౌన్సిలర్లు చింతకాయల రాజేష్, దనిమిరెడ్డి మధుతో పాటు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. నాయుడుబాబు మృతి పార్టీకి తీరనిలోటని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఆయన కుటుంబాన్ని పార్టీ ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సతీశ్‌కు పురస్కారం

నాతవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంబీపట్నం హైస్కూల్ ఉపాధ్యాయుడు సీతా సతీశ్ జాతీయ స్థాయిలో నిర్వహించిన సంక్రాంతి ప్రతిభా పోటీల్లో సాహిత్యానికి సంబంధించి పురస్కారం అందుకున్నారు. కరీంనగర్ ఫిలిం భవన్‌లో 18, 19 తేదీలలో ఆర్యాణీ సకల వేదిక, గౌతమేశ్వర సాహితి కళాసంస్థ వారు నిర్వహించిన జాతీయ స్థాయి ప్రతిభా పోటీల్లో సతీశ్ గౌతమీ కవి శ్రేష్ఠ పురస్కారం-2025 అందుకున్నారు. దూడపాక శ్రీధర్ రూపొందించిన 'ఇంతకీ నువ్వెవరు' కవితా సంకలనంలో పుస్తకంలో సతీశ్ మాస్టారు ఆనందం అనే శీర్షికతో కవితను రాయగా, గౌతమీ కవి శ్రేష్ఠ పురస్కారం లభించింది.

ఘనంగా రావాలమ్మ తీర్థ మహోత్సవం

కె.కోటపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరాధ్య దైవం రావాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాద రావు, బండారు నరసింహ నాయుడు, కన్నూరు సూర్యనారాయణ, కశిరెడ్డి అప్పలనాయుడు, జూరెడ్డి రాము, బత్తి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

సత్యవరంలో మరిడిమాంబ తీర్థం

మాడుగుల రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సత్యవరం గ్రామంలో మరిడిమాంబ తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ పి.సూర్యనారాయణ, నాయకులు పి.అప్పరాజు, జగ్గారావు, దేముడు పాల్గొన్నారు.

ఏఎల్‌పురం రజకుల బల్లల పండగ

కృష్ణాదేవిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురంలో గౌరీ పరమేశ్వర రజిక సంఘం ఆధ్వర్యంలో బల్లల పండగ వైభవంగా జరిగింది. పలు వీధుల్లో గౌరీపరమేశ్వర చిత్రపటాలతో సాంస్కృతిక కార్యక్రమాల మధ్య పల్లకీని ఊరేగించారు. ఈ సందర్భంగా శక్తివేశాలతో పాటు మహిళలతో చిడతలు, కోలాటం, జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌరీపరమేశ్వర రజిక సంఘం నాయకులు, ప్రజలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



బల్లల పండగలో సాంస్కృతిక కార్యక్రమాలు

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు

మాకవరపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.గంగవరం గ్రామంలో గౌరీపరమేశ్వరుల పండగను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మవారి విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. చితల డాన్సు, భజనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువులో గౌరీపరమేశ్వరుల విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గౌరీపరమేశ్వరుల సారె ఊరేగిస్తున్న భక్తులు

మరుపాకలో డీ-ఫారం భూమి స్వాధీనం

రావికమతం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపాక గ్రామానికి చెందిన నాలుగు ఎకరాల డీ-ఫారం భూములను రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన ఎలుసూరి రాజిబాబు, పైడమ్మ, చిన్నయ్యలకు జీవనోపాధి కోసం సర్వే నంబరు 180, 181లో ప్రభుత్వం సుమారు నాలుగు ఎకరాలు ఇవ్వగా, ఈ భూములను ఇదే గ్రామానికి చెందిన సోంబాబుకు అనధికారికంగా విక్రయించారని వీఆర్వో నాగరాజు తెలిపారు. పట్టాదారుల వారసులు సోంబాబు ఆధీనంలో ఉన్న భూములను తిరిగి తీసుకోవాలని ప్రయత్నించగా వివాదం నెలకొందని, బాధితుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో భూములను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు అమర్చినట్టు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

చోడవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గోవాడ జడ్పీ హైస్కూల్‌లోను, 2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు చోడవరం స్కూల్‌లోనేను 1988-89 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు రైవాడ రిజర్వాయర్ వేదికగా కలుసుకుని నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు.

ఇంటర్వ్యూ

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

-సిహెచ్.భీమరాజు, ఎస్ఐ



నాతవరం సంత రోజున ట్రాఫిక్ సమస్య రాకుండా తగిన చర్యలు చేపడుతున్నాం. భూముల వివాదాల పరిష్కారానికి తహసీల్దార్ వేణుగోపాల్, మండల ప్రత్యేకాధికారి నాగశిరీషాతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నాం. ఈ వేదికలో వచ్చిన భూ వివాదాలకు సంబంధించిన సమస్యలను కమిటీతో కలిసి పరిష్కరమయ్యేలా చూస్తున్నాం.

ప్రశ్న: మండలంలో భూ వివాదాలకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని ఏ విధంగా పరిష్కరిస్తున్నారు.

జవాబు: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ శనివారం తహసీల్దార్ వేణుగోపాల్, మండల ప్రత్యేకాధికారి నాగ శిరీషాతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నాం. ఈ కమిటీలో భూ వివాదాలు పరిష్కారమయ్యేలా తగిన చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: నాతవరంలో ప్రతీ మంగళవారం సంత రోజున ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: ఈ సమస్య రాకుండా ఒక ఏఎస్ఐను, కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసి వాహనాల రద్దీ లేకుండా చూస్తాం.

ప్రశ్న: దొంగతనాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

జ: దొంగతనాలు జరిగినట్టు ప్రస్తుతానికి ఎవరూ పోలీసులకు ఫిర్యాదులు చేయలేదు. అయినప్పటికీ దొంగతనాలు జరగకుండా తగిన నిఘా పెడుతున్నాం.

ప్రశ్న: రాత్రి సమయంలో రోడ్డు పక్కనే మందుబాబులు మద్యం తాగి ప్రయాణికులకు ఇబ్బందులు పెడుతున్నారు. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జ: ఈ నెలలో 22 మందిపై ఓపెన్ డ్రంక్ కేసులు నమోదు చేశాం. అలాగే ఫైన్ కూడా వేశాం.

-నాతవరం, ఆంధ్రజ్యోతి

31న అడవి రాజులబాబు పండగ

గొలుగొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవరం గ్రామంలో ఈ నెల 31న అడవి రాజులబాబు పండగ నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అడవి రాజులబాబును ఈ ప్రాంత ఇలవేల్పుగా పూజిస్తారు. పండగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామంలో ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

10న మత్స్యకార సంఘ ఎన్నికలు

చోడవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చోడవరం గౌరీశంకర మత్స్య సహకార సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. వచ్చే నెల 10న ఎన్నికల నిర్వహణకు మత్స్యశాఖ అధికారిని నియమించారు.

చమ్మచింతలో ఆధార్ శిబిరం ఏర్పాటు చేయాలని వినతి

నాతవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చమ్మచింత గ్రామంలో ఆధార్ నమోదు శిబిరం ఏర్పాటు చేయాలని శ్రేయోభిలాషి సంస్థ అధ్యక్షుడు నానాజీ కోరారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారి పి.పార్థసారథికి సోమవారం వినతిపత్రం అందించారు. ఇప్పటివరకు చమ్మచింత గ్రామంలో ఒకసారి కూడా ఆధార్ క్యాంపు నిర్వహించలేదని చెప్పారు. దీంతో ఇక్కడ విద్యార్థులు ఆధార్ చేర్పులు, మార్పుల కోసం ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో నానాజీ పేర్కొన్నారు.

గురుపూడిలో పూరిల్లు దగ్ధం

నాతవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గునుపూడి గ్రామంలోని దళిత కాలనీలో సోమవారం ఓ పూరిల్లు దగ్ధమైంది. నిండుగొండ మరినమ్మకు చెందిన ఇల్లు విద్యుత్ షార్టుసర్క్యూట్ఎ కారణంగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో వంట సామగ్రితో పాటు బట్టలు, బీరువా తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. అయితే పండగ సెలవుల కారణంగా అందరూ చుట్టాలు ఇంటికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు ఊపిరి తీసుకున్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య బాధితురాలు మరినమ్మను పరామర్శించి ప్రభుత్వం నుంచి తగిన సాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు

మాడుగుల/మాడుగుల రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా మాడుగుల గ్రామానికి చెందిన శ్రీనాధు శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీనివాసరావుకుమాడుగుల ఆర్య వైశ్యులు సోమవారం అభినందనలు తెలిపారు

నేడు మండల సమావేశం

మాడుగుల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.అప్పారావు తెలిపారు. అన్ని శాఖలు అధి కారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

కలెక్టర్‌ను కలిసిన టీడబ్ల్యూ ఎస్‌డీసీ


కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు మొక్కను అందిస్తున్న ఎస్‌డీసీ లోకేశ్వరరావు

పాడేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌ను టీడబ్ల్యూ ఎస్‌డీసీ వీఎస్.లోకేశ్వరరావు సోమవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలులో ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా పని చేస్తున్న లోకేశ్వరరావును స్థానిక టీడబ్ల్యూ ఎస్‌డీసీగా ప్రభుత్వం నియమించింది. దీంతో విశాఖపట్నంలో విద్యపై జోనల్ స్థాయిలో జరుగుతున్న వర్క్‌షాప్‌లో పాల్గొన్న కలెక్టర్‌ను ఆయన కలిసి మొక్కను అందించారు.

లోకేశ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి తిరుమలరావు

సీలేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను ఉప ముఖ్యమంత్రిగా నియమించాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి తిరుమలరావు కోరారు. సోమవారం ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు లోకేశ్ రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టి నాయకులు, కార్యకర్తల్లో ధైర్యం నింపారని, ప్రజల సమస్యలను తెలుసుకున్నారన్నారు. లోకేశ్ కృషితోనే టీడీపీ సభ్యత్వం కోటికి చేరుకుందన్నారు. నిరంతరం ప్రజలు, కార్యకర్తల సంక్షేమం కోసం ఆలోచించే లోకేశ్‌ను ఉప ముఖ్యమంత్రిగా నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

మారుమూల గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు


సీలేరు మార్కెట్ సెంటర్‌లో థింసా నృత్యం చేస్తున్న పిల్లిగెడ్డ గిరిజనులు

సీలేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సీలేరు మారుమూల గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను గిరిజనులు జరుపుకుంటున్నారు. గిరిజనుల సంక్రాంతి సంబరాలు మైదాన ప్రాంతాల పండుగలకు భిన్నంగా ఉంటాయి. సోమవారం రాత్రి పిల్లిగెడ్డ గిరిజనులు సీలేరు మార్కెట్ సెంటర్‌లో థింసా నృత్యాలు వేస్తూ సందడి చేశారు. వర్తకులు గిరిజనులకు చందాలు, చల్లని పానీయాలు ఇచ్చి వారిని సంతోషంగా గ్రామానికి సాగనంపారు.

సభ్యత్వాలు చేసిన టీడీపీ శ్రేణులకు కృతజ్ఞతలు

తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరమణ

పాడేరురూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వాలు చేయించిన శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సైన్యానికి, పార్టీ శ్రేణులకు తెలుగు యువత పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ(బుజ్జి) కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల్లో 35,600 క్రియాశీలక సభ్యత్వాలు సకాలంలో చేయించేందుకు పార్టీ మండలాధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులకు, బూత్ కమిటీలకు, గ్రామ శాఖ అధ్యక్షులకు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచులను ఆయన అభినందించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఈశ్వరి సైన్యం ఏకతాటిపై కృషి చేయాలని ఆయన కోరారు.

రాధమ్మకు పింఛన్ ఇస్తాం : ఎంపీడీవో

‘ఆంధ్రజ్యోతి’ ఎఫెక్ట్

గూడెంకొత్తవీధి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ వృద్ధురాలు సిందేరి రాధమ్మకు పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ‘పింఛన్ కోసం దివ్యాంగురాలి నిరీక్షణ’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’ రాధమ్మ దీన పరిస్థితిని వివరిస్తూ ప్రచురించిన కథనానికి డీఆర్‌డీఏ పీడీ స్పందించారు. వెంటనే గ్రామాన్ని సందర్శించి వివరాలు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ టంగుళ్లగొంది గ్రామాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడుతూ రాధమ్మకు ఏడాది క్రితం వరకు ఆధార్ కార్డు లేదన్నారు. ఈకారణంగా పింఛన్ రాలేదని, ఐటీడీఏ పీవో చొరవతో ఇటీవల ఆధార్ కార్డు వచ్చిందన్నారు. ప్రభుత్వం కొత్త పింఛన్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే ఆమెకు పింఛన్ మంజూరు చేస్తామన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు : ఎమ్మెల్యే


జిల్లా ఆస్పత్రిలో ప్రివెంటివ్ క్యాన్సర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరురూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచించారు. సోమవారం ఆయన జిల్లా సర్వజన ఆస్పత్రిలో వెల్‌నెస్ ఓపీ కేంద్రాన్ని, ప్రివెంటివ్ క్యాన్సర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే గిరిజనులతో ప్రేమగా మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆస్పత్రి మెడికల్ పర్యవేక్షకురాలు డాక్టర్.విశ్వమిత్ర మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రాష్ట్రమంతా వెల్‌నెస్ కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతీ, సోమ, బుధవారాలు చికిత్సలతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రతీ మంగళ, గురువారాలలో క్యాన్సర్ అనుమానిత రోగులు పరీక్షలు చేయించుకోవచ్చని, అనుమానితులను హోమిబాబా క్యాన్సర్ కేంద్రానికి రిఫర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప పర్యవేక్షకులు డాక్టర్.టి.నర్సింగరావు, వైద్యులు పాల్గొన్నారు.

జీసీసీ బంకులో పెట్రోల్ కొరత

డుంబ్రిగుడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జీసీసీ బంకులో సోమవారం ఉదయం నుంచి పెట్రోల్ కొరత ఏర్పడింది. దీంతో వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే వివిధ కిరాణా దుకాణాల్లో బ్లాకులో అధిక ధరలకు విక్రయాలు జరిగాయి. తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరలకు కొనుగోలు చేసి వాహనదారులు ప్రయాణం సాగించారు.

కుష్ఠు రోగులకు మెరుగైన సేవలందించాలి

జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ, డీఎంహెచ్‌వో జమాల్ బాషా, తదితరులు

పాడేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ అన్నారు. తన కార్యాలయంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ముద్రించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందన్నారు. సమగ్ర సర్వే చేసి కుష్ఠు వ్యాధితో బాధపడే వారిని, వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి వైద్యం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : ఏఎస్పీ మిశ్రా


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

గూడెంకొత్తవీధి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంతంలో గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో గంజాయి ఎక్కడ పట్టుబడినా మూలాలు గిరిజన ప్రాంతం వైపు చూపిస్తున్నాయన్నారు. గతంతో పోల్చుకుంటే గంజాయి సాగు, రవాణా కొంత వరకు తగ్గిందన్నారు. ప్రస్తుతం ఒడిశా నుంచి గంజాయిని గిరిజన ప్రాంతం మీదుగా పొరుగు రాష్ట్రాలకు స్మగ్లర్లు ఎగుమతి చేస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు కూడా గంజాయి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. మావోయిస్టు కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు శాఖ ద్వారా గిరిజన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ తెలియజేస్తే సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీఐ వర ప్రసాద్, ఎస్ఐ అప్పలసూరి, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశానికి రాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మండల సమావేశంలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకుంటే ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు ఎవరి చెప్పాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రశ్నించారు. సోమవారం మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 50 శాతం మంది అధికారులు హాజరుకాలేదన్నారు. హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావుని ఆదేశించారు. తొలుత పలుశాఖల అధికారులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏపీ ఈపీడీసీఎల్ ఏఈఈ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి విద్యుత్ సదుపాయం కల్పించామన్నారు. లోతుగెడ్డ సర్పంచ్ చింతపల్లి సునీల్ మాట్లాడుతూ గొచ్చెపల్లిలో చిట్టిబాబు అనే వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని, పరిహారం చెల్లించాలన్నారు. దీనికి ఏఈఈ స్పందిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించామని, పరిహారం అందుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ గోకులాల నిర్మాణాలపై ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరగా.. ఏపీవో రాజు గోకులాల వివరాలను వివరించారు. ఎస్ఎంఐ చర్చలో ఎంపీపీ అనుషదేవి, ఎ. శనివారం సర్పంచ్ పేట్ల రాజుబాబు మాట్లాడుతూ చెక్‌డ్యామ్‌లు మరమ్మతులకు గురికావడం వల్ల సాగునీరు అందడం లేదన్నారు. దీనికి ఏఈఈ లోకేశ్‌కుమార్ సమాధానం ఇస్తూ చెక్‌డ్యామ్, చెరువులు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. తొలివిడతగా తాజంగి జలాశయం, చౌడుపల్లి చెరువు, సిరిపురం చెక్ డ్యామ్ మరమ్మతులకు నిధులు విడుదలయ్యాయన్నారు. పనులు వెంటనే ప్రారంభిస్తామన్నారు. ప్రతి పంచాయతీలో ఐదు చొప్పున కొత్త చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు, ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో నలుగురు పిడియాట్రిక్స్ పోస్టులకు కేవలం ఒకరు మాత్రమే ఉన్నారని, అందుబాటులోనున్న వైద్యులతో మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. ఎంపీపీ అనుషదేవి మాట్లాడుతూ.. తాజంగి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరారు. నర్సీపట్నం-చింతపల్లి టూ స్టాప్ బస్సు ప్రతి చోట నిలిపివేస్తూ పాసింజర్ సర్వీసు మాదిరిగా నడుపుతూ అధిక చార్జీ తీసుకుంటున్నారని ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, ధారలక్ష్మి పద్మ అన్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు స్పందించి టూ స్టాప్‌ని కేవలం నిర్దేశించిన రెండు చోట్ల మాత్రమే ఆపాలన్నారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన

పీఏసీఎస్ యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా యూనిట్ అధ్యక్షుడు రామకృష్ణ



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

పాడేరురూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు దశలవారీ ఆందోళన చేపడతామని పీఏసీఎస్ యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా యూనిట్ అధ్యక్షుడు జి.రామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం 2019 మార్చిలో జీవో 36ను విడుదల చేసిందని, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జీవోను అమలు చేయలేదన్నారు. జీవోను విడుదల చేసిన టీడీపీ ప్రభుత్వమే ప్రస్తుతం అధికారంలోకి రావడంతో సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశపడినప్పటికీ నిరాశ తప్పడం లేదన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి దశల వారీ ఆందోళన చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అనకాపల్లి యూనిట్ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, పీఏసీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

జిల్లా రవాణా శాఖాధికారి లీలాప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీటీవో లీలా ప్రసాదు

ముంచంగిపుట్టు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జిల్లా రవాణా శాఖాధికారి (డీటీవో) లీలాప్రసాద్ స్పష్టం చేశారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో మోటార్ వాహనాల ఆపరేటర్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ ప్రయాణ సమయంలో వాహనదారులు తగిన భద్రత నియమాలు పాటించాలని సూచించారు. మోటార్ వాహన చట్టం-1988 ప్రకారం అమలు చేయాల్సిన నిబంధనలకు సంబంధించిన రహదారి భద్రత, హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ సిగ్నల్స్ తదితర అంశాలపై వాహన చోదకులకు ఆయన అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించని వాహన చోదకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, మోటార్ యూనియన్ ప్రతినిధులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పశువైద్య శిబిరాలు

అనంతగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి, ఎగువశోభ పంచాయతీల పరిధిలోని గ్రామాలల్లో సోమవారం ప్రత్యేక పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సందీప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు ముందస్తుగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. రైతులందరూ అప్రమత్తం ఉండాలని సూచించారు. రెండు పంచాయతీల్లో 30 పశువులుకు వైద్యసేవలను అందించి, 124 పశువులకు నట్టల నివారణ టీకాలు, 210 మేకలకు నట్టల నివారణ టీకాలతో పాటు 640 కోళ్లకు వ్యాక్సినేషన్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింహాద్రి, నాయకులు జగదీశ్వరరావు, అనిల్‌కుమార్, సుందర్, రవికుమార్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండలంలోని అరకు, కురిడి పంచాయతీ గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. అరకు సర్పంచ్ జి.శారద శిబిరాలను ప్రారంభించారు. పశు వైద్యాధికారి రాజశ్రీ మూగజీవులకు సేవలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూగజీవులకు ఎటువంటి వ్యాధులు సోకిన వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందిస్తే సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ దివ్య, వెటర్నరీ అసిస్టెంట్ శెట్టి సుబ్బారావు, ఏహెచ్‌ఏలు రమేశ్ అనంత్, మహేష్, సంజీవరావు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్ షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి

అరకులోయ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం ఇంటర్న్ షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని అరకులోయ ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధ్యమైనంత ఎక్కువ మంది యువత ఈ పథకాన్ని వినియోగించు కోవాలని సూచించారు. ప్రతీ ఇంటర్న్‌కు 12 మాసాల పాటు శిక్షణ ఉంటుందన్నారు. నెల వారీ సహాయం కింద రూ.4,500, పరిశ్రమల ద్వారా రూ.500, సంఘటనల కోసం రూ.ఆరు వేలు వన్ టైమ్ గ్రాంట్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే శిక్షణ కాలంలో ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద బీమా కవరేజ్ వర్తిస్తుందని వివరించారు. ఇంటర్న్ షిప్ అనంతరం ప్రతిష్టాత్మకమైన కంపెనీలలో ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ వంటి కోర్సులు పూర్తి చేసిన 21 నుంచి 24 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులుగా ఆయన పేర్కొన్నారు.

రోడ్ల నిర్మాణాలతో గ్రామాల అభివృద్ధి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


గుమ్మ-చెరుకుబిడ్డ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణం ద్వారా గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని గుమ్మ పంచాయతీ కేంద్రంలోని గుమ్మ-చెరుకుబిడ్డ రింగురోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ సహకారంతో రోడ్ల నిర్మాణంపై దృష్టిసారిస్తామన్నారు. ఈ రింగురోడ్డు నిర్మాణంతో గుమ్మతో పాటుగా నిమ్మఊట, ఎగువముల్లేలు, దిగువముల్లేలు, మిర్తిదుంగడ, మద్దిపాడు, బూరుగుపాడు, కరకవలస, బూసుపాడు, కాకీవలస, పోర్లువలస, కరివేసు, మర్రివలస, చీడివలస, చెరుకుబిడ్డ గ్రామాల గిరిజనులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రాములమ్మ, వైసీపీ నాయకులు స్వామి, లక్ష్మణ్‌రావు, కృష్ణమూర్తి, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుళ్లాట ఆడిస్తున్న ఇద్దరిపై కేసు

కశింకోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం గ్రామ శివారులో గుళ్లాట ఆడి స్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది వెళ్లి దాడిచేశారన్నారు. ఇద్దరు పట్టుబడగా, వారి నుంచి ఆరు గుళ్లు, రూ.1550 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

పాడేరురూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు తెలిపారు. ఆధార్ అప్‌డేట్, న్యూ ఎన్‌రోల్‌మెంట్, డాక్‌మెంట్ అప్ డేట్స్, బయోమెట్రిక్ అప్‌డేట్స్ తదితర ఆధార్ సేవలను అందిస్తారన్నారు. ఈనెల 21, 22వ తేదీలలో ఇరడాపల్లి, వంతాడపల్లి, వంట్లమామిడి గ్రామ సచివాలయాల్లో, 23, 24వ తేదీలలో పాడేరు-3, దేవాపురం, సలుగు గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఆధార్ సమస్యలు ఉన్న ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గిరిజన సంక్షేమ, మహిళా, శిశు సంక్షేమ శాఖకు ప్రాధాన్యత ఇచ్చి ఆధార్ కార్డు లేని వారికి నమోదు చేయించడానికి అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఆరేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా ఆధార్ కార్డు కోసం నమోదు చేయించాలన్నారు.

గ్యాస్ డెలివరీ బోయ్‌కి అదనపు రుసుం చెల్లించవద్దు

పాడేరురూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులు సిలెండరును పొందినపుడు డెలివరీ బోయ్‌కి ఎటువంటి అదనపు రుసుం చెల్లించ వద్దని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 కిలోమీటర్లు పరిధిలో నివసించే వినియోగదారులకు సిలెండర్‌లను ఇంటి వద్దకు డెలివరీ చేసినపుడు వినియోగదారులు ఎటువంటి అదనపు రవాణా చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారులు సిలెండర్ బరువు సరిచూసుకోవచ్చని తెలిపారు. డెలివరీ బోయ్ అదనపు రుసుం కోసం వత్తిడి చేస్తే 1967కి లేదా జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గ్యాస్ ఏజెన్సీ, డెలివరీ బోయ్‌లపై చర్యలు తీసుకుంటారని ఆయన స్పష్టం చేశారు.

పులి సంచారం వదంతులపై భయాందోళన

సీలేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సీలేరు, పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తోందన్న వదంతులతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం సీలేరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్‌లో కొందరి ప్రయాణికులు దుప్పులవాడ సమీపంలో పులిని చూసినట్టు ప్రచారం జరిగింది. దీంతో సీలేరు ధారకొండలకు నిత్యం ద్విచక్ర వాహనాలపై తిరిగే వారిలో ఆందోళన నెలకొంది. అయితే ఈ వదంతుని అటవీ శాఖ అధికారులు ఖండించారు. ఏదో జంతువును చూసి పులి అని భ్రమపడి ఉంటారని వారంటున్నారు. సప్పర్ల రేయిన్‌గేజ్ వద్ద తప్ప సీలేరు, దుప్పులవాడల్లో పులి సంచరించలేదని వారు స్పష్టం చేస్తున్నారు. సీలేరు, ధారకొండ సెక్షన్ పరిధిలో తమ సిబ్బందితో పులి జాడలను గుర్తించే చర్యలు చేపట్టామని అటవీ శాఖ రేంజ్ అధికారి ఎస్. వెంకటరావు తెలిపారు. పులి సంచారంపై వదంతులను నమ్మవద్దని కోరారు.

ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యం తగదు

సిబ్బందికి ఎంపీడీవో హెచ్చరిక

కొయ్యూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఈజీఎస్ మార్గదర్శకాలకు అనుగుణంగా పనుల కల్పనలో సిబ్బంది నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సేద్యపు నీటి కుంటలను ఏర్పాటు చేసుకునేవిధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ జాబ్‌కార్డుదారునికి 100 రోజులు పని కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో శ్రీనివాసరావు, ఈసీ వీర్రాజు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలకు విశేష స్పందన

కిల్లో పూర్ణచంద్రరావు

చింతపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో టీడీపీ సభ్యత్వాలకు విశేష స్పందన లభిస్తుందని పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నాయకత్వంలో 36,500 సభ్యత్వాలు నమోదు చేయించామన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేశారన్నారు. ఈనెల 26వ తేదీ వరకు టీడీపీ సభ్యత్వాల నమోదు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, నాయకులు అబ్బాయినాయుడు, సోమేశ్, కేశ్వరరావు, మహేంద్ర పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగపర్చుకోండి

కొయ్యూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలను ప్రతి రైతు సద్వినియోగపరుచుకోవాలని పశు వైద్యాధికారి కాగిత రాజేష్‌కుమార్ అన్నారు. సోమవారం రావణాపల్లి, నల్లగొండ గ్రామాలలో పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో 184పశువులకు, 83 చిన్న పశువులకు, 272 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో సర్పంచులు కాకురు లక్ష్మి, రాజకుమారి, వైద్యాధికారులు ప్రసన్న, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏహెచ్ఏ శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్ షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానం

- పోస్టర్‌ను ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ జాహ్నవి
- నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచన
- రిజిస్ట్రేషన్‌కు నేడు చివరి తేదీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ జాహ్నవి, వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం ఇంటర్న్ షిప్ పథకం నమోదుకు ఈనెల 21వ తేదీ మంగళవారం ఆఖరు రోజని, జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పిలుపునిచ్చారు. ఇక్కడి కలెక్టరేట్‌లో సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సాధ్యమైనంత ఎక్కువ మంది యువత ఈ పథకాన్ని వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు మాట్లాడుతూ ప్రతి ఇంటర్న్‌కు 12 మాసాల పాటు శిక్షణ ఉంటుందన్నారు. నెల వారీ సహాయం కింద రూ.4,500, పరిశ్రమల ద్వారా రూ.500, సంఘటనల కోసం రూ.ఆరు వేలు వన్ టైమ్ గ్రాంట్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే శిక్షణ కాలంలో ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద బీమా కవరేజ్ వర్తిస్తుందని వివరించారు. ఇంటర్న్ షిప్ అనంతరం ప్రతిష్టాత్మకమైన కంపెనీలలో ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21లోగా హెచ్‌టీటీపీఎస్/ పీఎం ఇంటర్న్ షిప్.ఎంసీఏ.జీవోవి.ఐఎన్/ లాగిన్/ లింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ వంటి కోర్సులు పూర్తి చేసిన 21 నుంచి 24 సం వత్సరాలు వయస్సు కలిగిన వారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90107 93492 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

నైపుణ్యం కలిగిన వారికి ఉపాధి అవకాశాలు


సర్వీస్ ప్రొవైడర్ల నమోదులో మాట్లాడుతున్న సురేంద్ర

అనకాపల్లి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్యం కలిగిన వారికి ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. గాంధీనగరంలో సోమవారం మెప్మా, హోం ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకున్న చేతివృత్తిని దృష్టిలో పెట్టుకుని ఈ స్కీమ్‌లో చేరితే ప్రతి నెలా రూ.20 వేల నుంచి రూ.30వేల వరకు ఆదాయం పొందవచ్చునని వివరించారు. మెప్మా ఏపీడీ వై.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పదకొండు రకాల సేవలు తొలివిడతలో ఈ కార్యక్రమంలో అందుబాటు లోకి వస్తాయన్నారు. హోం ట్రయాంగిల్ యాప్‌లో దరఖాస్తు చేసుకుంటే ఆ యాప్ ద్వారా పనులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కూటమి నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, మాదంశెట్టి నీలబాబు, డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, పోలారపు త్రినాథ్, ఆళ్ల రామచంద్రరావు, తాడి రామకృష్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో రిఫరీ శ్రీనివాసరావుకు ఘన సత్కారం


శ్రీనివాసరావుకు పూలమాలలు వేసి స్వాగతం పలుకుతున్న నాయకులు

తుమ్మపాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తుమ్మపాలకు చెందిన సీహెచ్ఎల్ఎం శ్రీనివాసరావు ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన తొలి ఖోఖో వరల్డ్ కప్ పోటీలకు రిఫరీగా వ్యవహరించి సోమవారం అనకాపల్లికి చేరుకోవడంతో గ్రామ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు నాయకులు ఆడారి గోవిందరావు, పీలా విశ్వేశ్వరరావు, రాపేటి రామ్‌కుమార్, చదరం చిన్న తదితరులు పూలమాలలు వేసి, గ్రామంలో డప్పు వాయిద్యాలతో ఆయనను ఊరేగించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తొలి ఖోఖో వరల్డ్ కప్‌కు రిఫరీగా బాధ్యతలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

'డీపీఎన్' పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక


బయ్యవరం సమీపంలోని తోటలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కశింకోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డీపీఎన్ హైస్కూల్‌లో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా సోమవారం బయ్యవరం సమీపంలో గల గుత్తా ప్రభాకర్ చౌదరి తోటలో కలుసుకున్నారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. రెండున్నర దశాబ్దాల అనంతరం కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

భూ ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు

లంకెలపాలెం, జనవరి 20: తాడి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 3/2ఏలో గల తమ భూమిను ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నరని ఓ వ్యక్తి సోమవారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. విశాఖపట్నం బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతానికి చెందిన ఎస్.రోహిత్‌వర్మకు తాడి రెవెన్యూ పరిధి జాతీయ రహదారి సాలాపువానిపాలెం సమీపంలో 3.72 ఎకరాల భూమి వుంది. సోమవారం సాయంత్రం కొంత మంది దౌర్జన్యంగా భూమిలోకి చొరబడి సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతోపాటు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

'సీనియర్ సిటిజెన్స్ భవనానికి స్థలం కేటాయించండి'

అనకాపల్లి టౌన్, జనవరి 20 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె.అప్పారావు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆఫీస్ ఇన్‌చార్జి ఎ.నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. అలాగే పాత శంకర్ థియేటర్ వద్ద గల ఖాళీ స్థలానికి పన్ను వేయాలని లక్ష్మి అనే మహిళ విన్నవించారు. అదేవిధంగా గతంలో తనకు టిడ్కో ఇల్లు కేటాయించారని రిజిస్ట్రేషన్ కూడా జరిగిందని, కానీ ఇంటికి తాళం వేశారని ఎస్.బోసు అనే వ్యక్తి అర్జీని అందించారు.

ఊరంతా.. ఇంతే..!

- నర్సాపురంలో క్షీణించిన పారిశుధ్యం
- ముందుకు పారని మురుగు
- అసంపూర్తిగా కాలువల నిర్మాణం
- దుర్వాసన, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు


గ్రామంలోని ఓ ఇంటి సమీపంలో దుస్థితి


నర్సాపురం గ్రామంలో దెబ్బతిన్న డ్రైనేజీ

కశింకోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమీన్ సాహెబ్ పేట (ఏఎస్ పేట) పంచాయతీ నర్సాపురంలో పారిశుధ్యం క్షీణించింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఎక్కడికక్కడ మురుగు తిష్ట వేస్తోంది. ఫలితంగా దోమల బెడద అధికమైంది. దీనికి తోడు దుర్వాసనను భరించలేకపోతున్నామని నివాసితులు వాపోతున్నారు.

ఏ కాలువలో చూసినా ఇంతే..!

ఏ కాలువలో చూసినా మురుగు ముందుకు పారని పరిస్థితి నెలకొంది. గ్రామంలో కొన్నిచోట్ల డ్రైనేజీలు పాడవ్వగా, మరికొన్నిచోట్ల అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటిని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో నేడు పరిస్థితి మరీ దారుణంగా ఉందని పలువురు వాపోతున్నారు. కాలువలు శుభ్రం


కాలువలో కదలని మురుగు

చేయించడంలోనూ పంచాయతీ అధికారులు పెద్దగా దృష్టిసారించడం లేదనే వాదన వినిపిస్తోంది. దుర్వాసన, దోమల వల్ల అంటువ్యాధుల భయం వెంటాడుతోందని, రాత్రివేళ కంటిపై కునుకు కరువవుతోందని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలి

గ్రామంలో ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులంతా కోరుతున్నారు. చాలా రోజులుగా ఈ సమస్య ఉన్నా అధికారుల్లో స్పందన లేకపోవడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలువలను పక్కాగా నిర్మించి, మురుగు పారేలా తక్షణ చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

దోమల బెడద అధికంగా ఉంది



గ్రామంలో మురుగు తీరని సమస్యగా మారింది. ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల చీకటి పడితే దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు భరించలేని దుర్వాసన మరిన్ని ఇబ్బందులకు కారణమవుతోంది. పలుచోట్ల కాలువలు అసంపూర్తిగా ఉండడంతో మురుగు ముందుకు పారడం లేదు. అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలి.

– పప్పుల రమణమ్మ, గృహిణి, నర్సాపురం

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయండి

- అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపు
- పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసి, తరగతులు ప్రారంభించాలని ఆదేశం


అక్షర వెలుగు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ తదితరులు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అక్షరాస్యత కోసం అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వయోజన విద్యా వాచకములు, వాలంటరీ మార్గదర్శకాలు పుస్తకాలను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. వయోజన విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్న ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం ద్వారా గుర్తించబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో మొదటి దశలో 11900 మంది అభ్యాసకులను, 1190 మంది వాలంటీర్లను గుర్తించడం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలో మండల అభివృద్ధి అధికారులు, ఏపీఎంలకు రెండు దశల శిక్షణ పూర్తి చేసినట్టు చెప్పారు. మండలస్థాయిలో వాలంటరీ టీచర్లకు ఒక దశ శిక్షణ పూర్తి చేసి, రెండవ దశ ప్రారంభించనున్నామని వివరించారు. గ్రామాల్లో గల మహిళా స్వయంశక్తి సంఘాలలో నిరక్ష రాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. వయోజన విద్యా తరగతులు నిర్వహించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, సామాజిక భవనాలు వినియోగించుకోవచ్చునని వివరించారు. అన్ని మండలాలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసి, వెంటనే తరగతులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, వయోజన విద్యాశాఖ సహాయ సంచాలకులు డి.చిన్నికృష్ణ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఎస్.మంజులవాణిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ తుహిన్ సిన్హాను కలిసిన పరవాడ డీఎస్పీ


ఎస్పీకి మొక్క అందజేస్తున్న విష్ణుస్వరూప్

పరవాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పరవాడ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వల్లెం విష్ణుస్వరూప్ సోమవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాను అనకాపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందజేశారు. నేరాల నియంత్రణతో పాటు గంజాయి రవాణా కట్టడికి ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ ఆయనకు సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

గుల్లాట ఆడిస్తున్న ఇద్దరిపై కేసు

కశింకోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం గ్రామ శివారులో గుల్లాట ఆడిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది వెళ్లి దాడిచేశారన్నారు. ఇద్దరు పట్టుబడగా, వారి నుంచి ఆరు గుళ్ళు, రూ.1550 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ముగిసిన బీజేపీ సభ్యత్వ నమోదు

- అనూహ్య స్పందన : జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు


ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదు సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో అనూహ్య స్పందన లభించినట్టు చెప్పారు. లక్షా 25వేల మంది ప్రాథమిక సభ్యత్వ నమోదు చేసుకున్నారన్నారు. పార్టీ క్రియాశీల సభ్యులుగా 963 మంది సభ్యత్వం పొందారన్నారు. జిల్లాలో మొత్తం 1828 పోలింగ్ బూత్‌లకు గాను 1200 పోలింగ్ బూత్‌లలో కమిటీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 25 సంస్థాగత మండలాల కమిటీల ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బీవీఎస్ వర్మ, కొణతాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, మంగళవారం నూతన జిల్లా అధ్యక్షుడి వివరాలను ఎంపీ కార్యాలయంలో ప్రకటించడం జరుగుతుందని పరమేశ్వరరావు తెలిపారు. వాటి సంబంధించి నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి బుద్ద లక్ష్మీనారాయణ, జిల్లా పరిశీలకులు ఎ.కేశవలకు అందజేశారు.

నేత్రపర్వంగా సీతారాముల తీర్థాలు


తాళ్లపాలెంలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా

కశింకోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో సీతారాముల తీర్థం సోమవారం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డు భక్తులతో కిక్కిరిసిపోయింది. విద్యుద్దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తదితరులు సీతారాములను దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కాయల మురళీ, కర్రి సత్యనారాయణ తదితరులు వారిని సత్కరించారు. కూటమి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, దొడ్డి రమణ, దాడి నాగరాజు, ద్వారపూడి సత్తిబాబు, ఆంధ్ర ప్రసాద్, ఉల్లింగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సబ్బవరంలో భక్తుల పూజలందుకున్న సీతారాములు

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం, ఆరిపాక, గొల్లలపాలెం శివారు జగన్నాథపురం గ్రామాల్లో సీతారామల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ మోపాడ అప్పారావు, బొండా రాజు, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, ముర్రు కనకరాజు, పాలిశెట్టి సురేశ్‌రాజ్, రమేశ్‌రాజ్, ఆదిపురెడ్డి పైడంనాయుడు, ఎన్‌పీ రాజు, బండారు రమణ తదితరులు పాల్గొన్నారు.


పరవాడ మండలం వెన్నెలపాలెం తీర్థంలో కోలాటం.. స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

పరవాడ : వెన్నెలపాలెంలో సీతారాముల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, స్థానిక నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు, లోకిరెడ్డి అబి సన్యాసినాయుడు, బోజంకి నాయుడు, ప్రసాద్, మారునాయుడు తదితరులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన కోలాటం, సాముగరిడీలు, చిడతలు, చిటికెల భజనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 84వ వార్డు సాలాపువానిపాలెంలో సీతారాముల పరసను వైభవోపేతంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెటగుళ్ళు, సాము గరిడీలు, బొమ్మల కొలువులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి. విజేతలకు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి చేతుల మీదగా నిర్వాహకులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాదంశెట్టి నీలబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు సాలాపు మోహన్‌రావు, శివ, నాగరాజు, చినవెంకటరమణ, సుమన్ అప్పారావు, తాతారావు, గెద్దం బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభం


పిసినికాడలో నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు


దిబ్బపాలెంలో పాడి రైతులకు మందులు అందజేత


తవ్వవానిపాలెంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, వైద్యులు

కొత్తూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పశు సంరక్షణ, పాడి సంపద వృద్ధిలో భాగంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో సోమవారం పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అనకాపల్లి మం డలం పిసినికాడలో పదిహేను పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. 65 పశువులకు, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ అనకాపల్లి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య, డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాల : దిబ్బపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టర్ రామారావు బృందం యాభై పశువులకు పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో పీలా అప్పారావు, పాల సంఘం అధ్యక్షుడు మళ్ల రామజగన్నాథరావు, కార్యదర్శి కఠారి రమణ, గ్రామ నాయకులు సూరిశెట్టి శివప్రసాద్, నర్సింగ్‌సంతోష్, తర్రా కాసులు, పెద్దాడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : వెదురుపర్తి రైతు సేవా కేంద్రం వద్ద పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముప్పై పశువులకు గర్భకోశ పరీక్షలు జరిపామని మండల పశువైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్స్ జార్జ్ తెలిపారు. పది రోజుల పాటు అన్ని గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ శిబిరాన్ని అనకాపల్లి సహాయ సంచాలకులు డాక్టర్ బి.సౌజన్య పర్యవేక్షించారు. అనంతరం 34 పశువులకు, 50 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గోపాలమిత్ర, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఉషాకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రారంభించిన ఈ శిబిరాలను ఈనెల 31 వరకు నిర్వహించనుందన్నారు. రైతులు ఆయా శిబిరాలకు పశువులను తెచ్చి వ్యాధులు నయం చేయించుకోవాలని సూచించారు. శిబిరాలకు సంబంధించిన పోస్టర్‌ను సర్పంచ్ బోకం స్వామినాయుడు ఆవిష్కరించారు. అనంతరం నలభై పశువులకు వైద్య పరీక్షలు జరిపారు. పలు పశువులు, దూడలకు నట్టల నివారణ మందు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.అరుణ, డాక్టర్ ఎస్.స్వర్ణలత, డాక్టర్ బి.సధ్య, వీఏహెచ్ వెంకటరావు, అప్పలరాజు, కిశోర్, మాజీ ఉప సర్పంచ్ బోకం శ్రీరామమూర్తి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి, కలెక్టర్ విజయకృష్ణన్


బారులుతీరిన అర్జీదారులు

అర్జీల పరిష్కారానికి శ్రద్ధ చూపాలి

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందే ప్రతి అర్జీని పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. అంతకు ముందు ఆమె మాట్లాడుతూ, అర్జీల పరిష్కారం విష యంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొంతమంది సమస్యలను స్వయంగా ఆలకించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మొత్తం 178 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్ఓ సత్యనారాయణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

అనకాపల్లి రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఏఎస్పీ దేవప్రసాద్ పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా వ్యక్తుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అర్జీలను ఆయా పోలీసు స్టేషన్లకు బదలాయించారు. భూ తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు, తదితర వాటికి సంబంధించి మొత్తం 37 మంది అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ(ఎస్‌బీ) అప్పారావు, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

23,200 కిలోల గో మాంసం సీజ్

» పశ్చిమ బెంగాల్ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా పట్టుకున్న నక్కపల్లి పోలీసులు

నక్కపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ నుంచి హైదరాబాద్‌కు పశుమాంసాన్ని తరలిస్తుండగా వేంపాడు హైవే వద్ద నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ కె.కుమారస్వామి తెలిపిన వివరాలిలా వున్నాయి. వేంపాడు హైవే వద్ద ఎస్ఐ సన్నిబాబు, సిబ్బంది సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. వేరే రాష్ట్రం రిజిస్ట్రేషన్‌తో వున్న కంటైనర్ లారీని ఆపి సోదా చేశారు. ఇందులో 1,400 బాక్సుల్లో ప్యాకింగ్ చేసిన 23,200 కిలోల పశుమాంసం వున్నట్టు గుర్తించారు. చినదొడ్డిగల్లు పశు వైద్యాధికారిని రప్పించి తనిఖీ చేయగా.. ఆవు మాంసంగా నిర్ధారణ అయ్యింది. మాంసాన్ని పశ్చిమబెంగాల్ నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్టు విచారణలో తేలింది. కంటైనర్ లారీని సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సన్నిబాబు చెప్పారు.


కంటైనర్ లారీలో గో మాంసం ప్యాకెట్లు

ఎమ్మెల్యే సమక్షంలో చర్చలు విఫలం

» ఐఎంయూ ఎదుట కొనసాగుతున్న వంగలి రైతుల ధర్నా

» నాడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్

» వర్సిటీ ప్రధానం ద్వారా వద్ద దీక్షా శిబిరం


ఐఎంయూ ఎదుట ధర్నా చేస్తున్న వంగలి గ్రామస్థులు

సబ్బవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల క్రితం నాటి పాలకులు, అధికారులు తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వంగలి రైతులు, ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ ఎదుట చేపట్టిన ఆందోళన సోమవారం మూడో రోజుకు చేరుకుంది. సుమారు 400 మంది రైతులు వర్సిటీ మెయిన్ గేటు ఎదుట శిబిరం ఏర్పాటు చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు లోపలికి వెళ్లకుండా వాహనాలను అడ్డంగా పెట్టారు. అంతకుముందు గ్రామ పెద్దలు, యూనివర్సిటీ అధికారులు, పెందుర్తి ఎమ్మెల్యే సమక్షంలో జరిపిన చర్చలు సఫలం కాకపోవడంతో ధర్నాను కొనసాగిస్తున్నట్టు సర్పంచ్ ఆకుల శ్రీహేమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 15 సంవత్సరాల క్రితం ఐఎంయూ ఏర్పాటుకు తమ గ్రామంలో 110 ఎకరాలను ప్రభుత్వానికి ఇచ్చామని, నిర్వాసిత రైతులు లేదా వారి పిల్లలకు అర్హతలనుబట్టి వర్సిటీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నాడు అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. భూములు ఇచ్చిన రైతులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.50 వేలు ఇస్తామని అప్పటి జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ఈ హామీలను ఇంతవరకు అమలు చేయకపోవడంతో భూములు ఇచ్చిన రైతులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు అధికారులు, పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మూడు రోజుల క్రితం ఆందోళన ప్రారంభించామని తెలిపారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సమక్షంలో వర్సిటీ అధికారులతో జరిగిన చర్చల్లో తమ డిమాండ్ల పరిష్కారానికి రాత పూర్వకంగా హామీ ఇవ్వకపోవడంతో ఆందోళనను కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆకుల గణేశ్, జెట్టి ప్రసాద్, ముత్యాలనాయుడు, గొర్లి అప్పలనాయుడు, జెట్టి శ్రీను, నర్సింగరావు, గవర అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు

నిర్వాసిత రైతులు ఐఎంయూ వద్ద ధర్నా చేస్తుండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ పిన్నింటి రమణ 20 మంది ఆర్మడ్ ఫోర్స్ సిబ్బంది, 20 మంది సివిల్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ వచ్చి పరిశీలించారు. ఇక్కడి పరిస్థితిని, ఉన్నతాధికారులకు వివరించారు.

ఉద్యోగం ఇస్తామని రెండు ఎకరాలు తీసుకున్నారు

- జెట్టి శ్రీనివాసరావు, వంగలి



ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం రెండు ఎకరాల భూమిని ఇచ్చేశాం. నాకు ఉద్యోగం ఇస్తామని అధికారులు చెప్పారు. ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ కింది ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు ఇస్తామన్నారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇది జరిగి పదిహేనేళ్లు అయ్యింది. వర్సిటీలో కనీసం హౌస్ కీపింగ్, గార్డెనింగ్ ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు.

జాతీయ టెన్నీకాయిట్ పోటీలకు సబ్బవరం విద్యార్థి

సబ్బవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు స్థానిక ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి జి.అసలేశ్‌కుమార్ ఎంపికయ్యాడని హెచ్ఎం ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన రాష్ట్రస్థాయి బాలబాలికల టెన్నీకాయిట్ పోటీల్లో అసలేశ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ చూపినట్టు చెప్పారు.


అసలేశ్‌కుమార్ అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా రగ్బీ సంఘం నూతన కార్యవర్గం

అచ్యుతాపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా రగ్బీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం ఇక్కడ జరిగాయి. అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్ఎన్‌వీ జగదీశ్, గౌరవ అధ్యక్షుడిగా కూండ్రపు వెంకునాయుడు, కార్యదర్శిగా కూండ్రపు నాగ వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా రెడ్డి చిరంజీవి, సంయుక్త కార్యదర్శిగా అడిగర్ల సుధీర్, కార్యనిర్వహక కార్యదర్శిగా వెంకట సత్యనారాయణ, కోశాధికారిగా కూండ్రపు రమేశ్, సభ్యులుగా సీహెచ్ శివాజీ, లాలం రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్ఆర్‌బీ) పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు సోమవారం సజావుగా కొనసాగాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలలో 600 మంది హాజరు కావాల్సి ఉండగా, 272 పురుష అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు ఎస్.బాలసూర్యారావు, ఎల్.మన్మథరావు, బి.రామకృష్ణారావు, టి.కల్యాణి పాల్గొన్నారు.

బావిలో జారిపడి రైతు మృతి

రాంబిల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపూడి పంచాయతీ అప్పన్నపాలెంలో వ్యవసాయ బావిలో పడి రైతు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాలిలా వున్నాయి. అప్పన్నపాలెం గ్రామానికి చెందిన లాలం రాజుబాబు(47) ఈ నెల 19వ తేదీ సాయంత్రం పొలంలోని బావి వద్ద పశువులకు నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడిపోయాడు. దివ్యాంగుడైన ఇతనికి ఈత రాకపోవడం, ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. పశువులకు నీరు తెచ్చేందుకు వెళ్లిన రాజుబాబు ఎంతసేపైనా రాకపోవడంతో అతని అన్న రమణ.. బావి వద్దకు వెళ్లి టార్చిలైట్ వేసి చూడగా, నీటిపై తేలుతూ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అందరూ కలిసి రాజుబాబును బయటకు తీయగా, అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహానికి ఎలమంచిలి సీహెచ్‌సీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు

» ప్రతి పంచాయతీలో ఓ మోడల్ ప్రాథమిక పాఠశాల

» తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకోండి

» పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమికోన్నత పాఠశాలలను పూర్తిగా రద్దు చేయనున్నామని, వాటి స్థానంలో ప్రతి పంచాయతీకి ఒక మోడల్ పాఠశాలను ఏర్పాటు చేస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. విశాఖ నగరంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారులు, ఉప విద్యా శాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పంచాయతీలో మోడల్ ప్రాథమిక పాఠశాలతోపాటు బేసిక్ పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు నేపథ్యంలో అక్కడ చదువుతున్న విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. మూడు కిలోమీటర్ల దూరం దాటి ఉన్న ఉన్నత పాఠశాలలకు వెళ్లే వారికి రవాణా చార్జీలు ఇస్తామన్నారు. ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతుల విద్యార్థులను వెనక్కి పంపిస్తామన్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. సమావేశంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల కలెక్టర్లు ఎంఎన్.హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, దినేష్ కుమార్, బీఆర్ అంబేద్కర్, పాఠశాల విద్యా ఆర్‌డీ విజయభాస్కర్, డీఈవోలు ప్రేమ్‌కుమార్, అప్పారావునాయుడు, బ్రహ్మాజీ, మాణిక్యాలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

25న గవరపాలెం గౌరమ్మ జాతర

» అమ్మవారికి సారె మహోత్సవం రేపు

అనకాపల్లి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం గౌరీ పరమేశ్వరుల జాతరను ఈ నెల 25వ తేదీన వైభవంగా నిర్వహించనునట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు చెప్పారు. సోమవారం సాయంత్రం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతర వివరాలను వెల్లడించారు. 22వ తేదీ ఉదయం గౌరీ పరమేశ్వరుల వార్షిక కల్యాణం, మధ్యాహ్నం అమ్మవారికి సారె మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 25వ తేదీ శనివారం తెల్లవారుజామున గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఉత్సవం సందర్భంగా గవరపాలెంతోపాటు చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి నుంకరమెట్ట జంక్షన్ వరకు, రింగురోడ్డు, తదితర ప్రాంతాల్లో భారీ విద్యుత్ సెట్టింగ్‌లు, తోరణాలను ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రికి పలుచోట్ల సాంస్కృతిక ప్రదర్శనలు వుంటాయని చెప్పారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొణతాల శ్రీనివాసరావు, కొణతాల వెంకట వరప్రసాద్, పెంటకోట వెంకట సత్యనారాయణ, కొణతాల నూక మహాలక్ష్మినాయుడు, పీవీరమణ, దాడి కృష్ణ, మద్దాల శంకరరావు, కొణతాల మురళీకృష్ణ, సూరిశెట్టి నరసింగరావు, కొణతాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముద్దాయికి ఐదేళ్ల జైలుశిక్ష

అనకాపల్లి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తూ పదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య సోమవారం తీర్పు చెప్పారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటన విడుదల చేశారు. 2021 జూన్ 28వ తేదీన స్థానిక శారదాబ్రిడ్జి సమీపంలో బొంది రమేశ్ నుంచి రెండు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాటి ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు.

సోమవారం తుది విచారణ జరగ్గా.. నిందితుడిపై పోలీసులు మోపిన అభియోగం నిర్ధారణ కావడంతో కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్.వీరకృష్ణ కేసును వాదించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

ఆహ్లాదం మాటున ప్రమాదం!

... 5వ పేజీ తరువాయి

ప్రమాదకరంగా వుంటుంది. సముద్రంలో పోటు సమయంలో ఆకస్మికంగా అలలు ఎక్కువ ఎత్తులో ఎగిసిపడుతుంటాయి. దీంతో నాలుగైదు అడుగుల ఎత్తులో వున్న రాళ్లపైన నిల్చున్న వారు సైతం అలల ధాటికి నీటిలో పడిపోయిన సందర్భాలు వున్నాయి. రాకాసి అలలను గమనించేలోపే పలువురు నీటిలో మునిగిపోయి గల్లంతు అవుతున్నారు. వీరిలో కొంతమంది సురక్షితంగా తీరానికి చేరుతుండగా, పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

మూడు నెలల్లో నలుగురు మృత్యువాత

కార్తీక మాసం ఆరంభం నుంచి సంక్రాంతి పండుగ వరకు రేవుపోలవరం తీరానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దీంతో ఈ కాలంలోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత 50 రోజుల్లో ఇక్కడ నీటిలో మునిగి నలుగురు చనిపోయారు. గత ఏడాది అక్టోబరు 27వ తేదీన ఎస్.రాయవరం మండలం కొరుప్రోలుకు చెందిన బంగా సంజయ్‌కుమార్(17), తురాల అర్జున్(19), ఈ నెల 15న కాకినాడ జిల్లాకు చెందిన సాత్విక్ (10), మణికంఠ (23) మృత్యువాత పడ్డారు. గత ఐదు సంవత్సరాల్లో రేవుపోలవరం వద్ద సముద్రంలో మునిగి పది మందికిపైగా పర్యాటకులు చనిపోయారు.

రైలు ప్రయాణికులకు టికెట్ వెతలు

... 5వ పేజీ తరువాయి

పరిస్థితి ఏర్పడుతున్నది. టికెట్ కౌంటర్ వద్ద రద్దీని తగ్గించడానికి ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషన్ అందుబాటులో వున్నప్పటికీ.. ఇక్కడ కూడా పెద్ద ఎత్తున క్యూ కడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గూడ్స్‌షెడ్ వైపున టికెట్ బుకింగ్ కౌంటర్‌ను పునఃప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. గూడ్స్‌షెడ్ వైపు టికెట్ కౌంటర్‌ను వినియోగంలోకి తేకపోవడంపై రైల్వే స్టేషన్ మేనేజర్ నచ్చి నివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ప్రస్తుతానికి ఆ టికెట్ కౌంటర్‌ను అందుబాటులోకి తేవడంపై ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు. అయితే స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నందున, ఇవి పూర్తయ్యేసరికి గూడ్స్ షెడ్ వైపు టికెట్ కౌంటర్ అందుబాటులోకి వచ్చే అవకాశం వుందన్నారు.

వెంటనే పునఃప్రారంభించాలి

పి.నాగేశ్వరరావు, సీహెచ్.రాము, చోడవరం



గూడ్స్‌షెడ్ వైపు టికెట్ కౌంటర్ వుంటే దూర ప్రాంతాల నుంచి వచ్చే తమలాంటి ప్రయాణికులకు ఎంతో బాగుంటుంది. కరోనా సమయంలో ఈ కౌంటర్‌ను మూసివేశారు. కొవిడ్ ప్రభావం పూర్తిగా తగ్గిపోయినప్పటికీ తిరిగి అందుబాటులోకి తేలేదు. దీంతో ప్రధాన స్టేషన్ మార్గంలోని కౌంటర్‌కు వెళ్లి టికెట్ తీసుకోవడం ఇబ్బందిగా వుంది. గూడ్స్‌షెడ్ వైపు టికెట్ కౌంటర్‌ను వెంటనే పునఃప్రారంభించాలి.

అన్న క్యాంటీన్‌లలో క్యూ ఆర్ కోడ్

... 5వ పేజీ తరువాయి

క్యూ ఆర్ కోడ్‌ను అమల్లోకి తెచ్చింది. ఎలమంచిలిలోని కొమ్మాయిగుండం వద్ద నిర్వహిస్తున్న క్యాంటీన్ లోపల, బయట గోడలపై క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ భోజన చేయడానికి వచ్చిన వారు.. తమ చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే 'ఈ క్యాంటీన్‌ను సకాలంలో తెరుస్తున్నారా? ఆహార పదార్థాలు నాణ్యతగా ఉంటున్నాయా? పరిశుభ్రతను పాటిస్తున్నారా? అని మూడు ప్రశ్నలు వస్తాయి. వీటికి అవును/ లేదు అని ఆప్షన్ వున్నచోట ఏదో ఒకదానిపై క్లిక్ చేస్తే సరిపోతుంది. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ బీజేఎస్‌పీ రాజు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యత, క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజల నుంచి తెలుసుకునేందుకు ప్రభుత్వం క్యూ ఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు.

జీవీఎంసీ కమిషనర్ బదిలీ

... 5వ పేజీ తరువాయి

గుర్తింపుపొందారు. నగరంలో వీధి దీపాల సమస్య పరిష్కారంతోపాటు కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో అవినీతి జరగకుండా చర్యలు చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించారు. అయితే ఆరు నెలలు కూడా పూర్తికాకుండానే సంపత్‌కుమార్‌ను బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. సంపత్‌కుమార్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.